# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 321 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 321 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 25 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు.. ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట

- ఏపీలో పెట్టుబడుల కోసం ఢిల్లీలో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం ఏర్పాటుకు యారాకు ఆహ్వానం
- విశాఖలో టెక్నాలజీ, ఇంజనీరింగ్ సెంటర్ల ఏర్పాటుకు సిస్కో, శాప్‌లకు విజ్ఞప్తి
- తిరుపతిలో ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయాలని వివోకు సూచన
- వైద్య పరికరాలు, ఆగ్రో కెమికల్ యూనిట్ల ఏర్పాటుకు అబాట్, గోద్రెజ్‌లకు ప్రతిపాదనలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా వారిని ఆహ్వానిస్తున్నారు.

- మిగతా 2లో



## విద్యుత్ లైన్లు తగిలి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అన్ని విధాలా సాయం అందిస్తాం

- విద్యుత్ ప్రమాదాలు, భారీ వర్షాలపై గొట్టిపాటి సమీక్షా సమావేశం
- విద్యుదాఘాతంతో నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి
- విద్యుత్ వైర్లు తెగిపడితే వెంటనే ఫిర్యాదు చేయాలా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన విద్యుత్ ప్రమాదాలు, ఉత్తరాంధ్రలో వాయు గుండం ప్రభావంతో తలెత్తిన పరిస్థితులపై రాష్ట్ర విద్యుత్ శాఖ

- మిగతా 2లో

## రాష్ట్రంలో నేడు కూడా వర్షాలు.. జలాశయాలు నింపండి

### సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- రాష్ట్రంలో నేడు కూడా వర్షాలు కొనసాగుతాయని అంచనాల నడుమ సీఎం చంద్రబాబు సమీక్ష
- భారీ వర్షాల నేపథ్యంలో జలాశయాలన్నీ నింపాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- గోదావరి, కృష్ణా బేసిన్లలో పలుచోట్ల వరద హెచ్చరికలు జారీ చేసే అవకాశం
- ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచన
- వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, క్రీడలు, విద్యుత్ సరఫరాపైనా కీలక ఆదేశాలు జారీ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో కూడా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతా వరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష జరిపి, క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా నదులు, వాగులకు వస్తున్న వరద ప్రవాహాలను సమర్థంగా వినియోగించుకుని రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, నీటి వనరులను నింపాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సాధారణ జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు కొంతమేర పెరిగాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రకాశం బ్యారేజీతో పాటు మున్నేరు పరీవాహక ప్రాంతం నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. ఈ నీటిని ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో నిల్వ చేయాలని, అవసరమైతే మోటార్లు ఉపయోగించి లిఫ్ట్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి ప్రవాహాలతో ఏలేరు రిజర్వాయర్‌లో 24 టీఎంసీల నీటిని నింపాలని, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు నీటిని తరలించాలని దిశానిర్దేశం చేశారు. విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం, మన్యం, కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా 16 జిల్లాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉందని అధికారులు తెలిపారు.

#### ప్రధాన నదులకు వరద హెచ్చరికలు

గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని

- మిగతా 2లో



## డేటా సెంటర్లకు ఏపీ కొత్త విధానం.. 70 శాతం గ్రీన్ ఎనర్జీ తప్పనిసరి

- విశాఖలో డేటా సెంటర్ల కోసం పోలవరం జలాల వినియోగం
- ఏపీలో 23 రంగాల వారీగా ప్రత్యేక క్లస్టర్ల ఏర్పాటు
- అమరావతిలో క్వాంటం టెక్నాలజీ ఎకోసిస్టమ్ అభివృద్ధి
- 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో ఏర్పాటు చేసే డేటా సెంటర్లు పర్యావరణ హితంగా ఉండేలా సమగ్రమైన విధానాన్ని అనుసరిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. డేటా సెంటర్లు వినియోగించే విద్యుత్‌లో కనీసం 70 శాతం సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే ఉండాలనే నిబంధనను తప్పనిసరి చేశామని ఆయన తెలిపారు.గురువారం ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డేటా సెంటర్ల ఏర్పాటుకు పర్యావరణపరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్ క్లస్టర్ నీటి అవసరాల కోసం పోలవరం ఎడమగట్టు కాలువ ద్వారా నీటిని తరలిస్తున్నామని చెప్పారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని విశాఖకు

- మిగతా 2లో



## అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు.. విచారణకు రావాలని ఆదేశం

- లిక్కర్ రవాణా కుంభకోణం కేసులో అంబటికి ఈడీ నోటీసులు
- ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి రావాలని ఆదేశం
- 15 రోజుల క్రితమే స్టంట్లు వేయించుకున్నానన్న అంబటి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి

- మిగతా 2లో



## యూపీలో కాలి బూడిదైన టూరిస్ట్ బస్సు..

### నిద్రలోనే 9 మంది సజీవదహనం

- యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై టూరిస్ట్ బస్సులో చెలరేగిన మంటలు
- ప్రమాదంలో 9 మంది ప్రయాణికులు సజీవ దహనం, పలువురికి గాయాలు
- నిద్రలో ఉండగా ఒక్కసారిగా వ్యాపించిన అగ్నికీలలు
- మృతుల కుటుంబాలకు సీఎం యోగి ఆదిత్యనాథ్ సంతాపం

- మిగతా 2లో

## 48 గంటల్లో రాజీనామా చేయాలి..

### ఈసీ జ్ఞానేష్ కుమార్ కు కాక్రోచ్ ల అల్టిమేటం



పెన్ పవర్ డెస్క్:48 గంటల్లోగా కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త ఆందోళన చేపడతామని అల్టీమేటం జారీ చేసింది. ఎన్నికల సంఘం చేపట్టిన SIR ప్రక్రియ, ఈసీ జ్ఞానేష్ కుమార్ పై తీవ్ర విమర్శలు

- మిగతా 2లో

## అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్..

- యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ ఛార్జీలకు వ్యతిరేకంగా వ్యాపారుల నిరసన
- అక్టోబర్ 2న 'నో యూపీఐ డే' పాటించాలని వ్యాపార సంఘాల పిలుపు
- రూ.2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతం రుసుమును విధించనున్న ప్రభుత్వం
- కొత్త నిబంధనలు వెనక్కి తీసుకోకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక

- మిగతా 2లో




## ఓటు చోరీ ఇప్పుడు చట్టం చోరీగా మారింది..

### సీఈసీ రాజీనామా చేయాలి

పెన్ పవర్ డెస్క్:చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన వ్యక్తి కాదని.. మోదీ, షా ద్వారా ఎన్నుకోబడ్డ వ్యక్తి అని అన్నారు లోక్ సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ. ఈ ముగ్గురు కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ఓటు చోరీ ఇప్పుడు చట్టం చోరీగా మారిందని విమర్శించారు. 2026 సెప్టంబర్ 24న ఈసీ భిన్నాభిప్రాయంపై ప్రెస్ మీట్ నిర్వహించిన రాహుల్ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు.

- మిగతా 2లో






## చైనా, అమెరికా ప్రత్యర్థులు కాదు..పార్టనర్స్

### అమెరికా పర్యటనలో జిన్ పింగ్

పెన్ పవర్ డెస్క్:మూడు రోజుల అమెరికా పర్యటనలో ఉన్న చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు. చైనా, అమెరికా దేశాలు ప్రత్యర్థులు కాదని.. భాగస్వాములని అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్ లోని బేస్ అండ్రూస్ లో ప్రత్యేక విమానంలో దిగిన జిన్ పింగ్ సందర్భంగా ఈ వ్యాఖ్యలు. సతీసమేతంగా అమెరికా పర్యటనకు వెళ్లిన జిన్ పింగ్ కు అందరినీ ఎన్నడూ లేని విధంగా ఆశ్చర్యపరుస్తూ ట్రంప్ దంపతులు స్వాగతం పలికారు.చైనా, అమెరికా ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆకాంక్షించారు. బుధవారం వాషింగ్టన్ చేరుకున్న జిన్ పింగ్ రాబోయే రోజుల్లో చైనా, అమెరికా కలిసి ముందుకు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఎన్నికల సంఘంపైనే ప్రశ్నలు తలెత్తితే?

## అంతర్గత అభ్యంతరాలకు రాజకీయ వాదనలు కాదు... పారదర్శక సమాధానాలే పరిష్కారం

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంత ముఖ్యమో, ఎన్నికలను నిర్వహించే వ్యవస్థపై ప్రజలకు ఉండే విశ్వాసం కూడా అంతే ముఖ్యం. ఎన్నికల ఫలితంపై రాజకీయ పార్టీలు విభేదించవచ్చు. ఓటర్ల జాబితాలపై ఆరోపణలు, ప్రత్యారోపణలు రావచ్చు. కానీ ఎన్నికల వ్యవస్థలోనే కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వారి నుంచి ప్రశ్నలు తలెత్తినప్పుడు వాటిని సాధారణ రాజకీయ వివాదంగా కొట్టిపారేయడం సరికాదు.

ఇటీవల ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ఈ నేపథ్యంలో తీవ్రమైన చర్చకు దారితీసింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాలు, ఆదేశాలపై లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు--పునరుద్ధరణ, ఫారం--6లో మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఐటీ వ్యవస్థపై పర్యవేక్షణ వంటి కీలక అంశాలు ఇందులో ఉన్నట్లు నివేదిక తెలిపింది.

ఇక్కడ ఎవరి రాజకీయ వాదన సరైనదన్నది ప్రధాన ప్రశ్న కాదు. దేశ ఎన్నికల వ్యవస్థపై తలెత్తిన ప్రశ్నలకు ప్రజలకు అర్థమయ్యే సమాధానాలు ఉన్నాయా? అన్నదే ముఖ్యం.

**ఓటర్ల జాబితా ప్రక్షాళన అవసరమే... కానీ**

ఓటర్ల జాబితాలను ఎప్పటికప్పుడు సవరించడం ఎన్నికల నిర్వహణలో అవసరమైన ప్రక్రియ. మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులు, చట్టపరంగా అనర్హమైన నమోదులను గుర్తించి జాబితాలను సరిచేయాల్సిందే.

కానీ ఆ ప్రక్రియ ఎంత అవసరమో, దానిలో పారదర్శకత అంతకంటే అవసరం.

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--ూ×= ప్రక్రియలో 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముసాయిదా జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించబడినట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ఈ సంఖ్యలో నిబంధనలకు అనుగుణంగా తొలగించిన నమోదులు ఉండవచ్చు. అదే సమయంలో అర్హుడైన ఒక్క ఓటరు పేరు పొరపాటున తొలగిపోయినా, దానిని సరిచేసుకునేందుకు సులభమైన, వేగవంతమైన, న్యాయమైన అవకాశం ఉండాలి. ఎందుకంటే ఓటర్ల జాబితాలో ఒక పేరు అనేది కేవలం డేటాబేస్‌లోని ఒక ఎంట్రీ కాదు. అది ఒక పౌరుడు తన ఓటు హక్కును ఆచరణలో వినియోగించుకునేందుకు ద్వారం.

**డిజిటల్ వ్యవస్థకు జవాబుదారీతనం ఎవరిది?**

ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశాల్లో ఓటర్ల డేటాబేస్ నిర్వహణ ఒకటి.

సాంకేతికత ఎన్నికల వ్యవస్థను వేగవంతం చేయాలి. తప్పులను తగ్గించాలి. డూప్లికేట్ నమోదులను గుర్తించాలి. కానీ చట్టబద్ధ అధికారుల నిర్ణయాధికారాన్ని అస్పష్టమైన సాంకేతిక వ్యవస్థ భర్తీ చేసే పరిస్థితి ఏర్పడకూడదు. ఓటర్ల జాబితాలో ఒక పేరు ఎవరు చేర్చారు? ఎవరు తొలగించారు? ఎందుకు తొలగించారు? ఏ అధికారి అనుమతించారు? ఏ ఆధారంతో నిర్ణయం తీసుకున్నారు? తర్వాత ఆ నిర్ణయాన్ని ఎవరు మార్చారు?

**ఈ ప్రశ్నలన్నింటికీ స్పష్టమైన డిజిటల్ ఆడిట్ ట్రయిల్ ఉండాలి.**

గోవాలో స్థానిక ఎన్నికల నమోదు అధికారులు అర్హులుగా నిర్ధారించిన 97 మంది ఓటర్ల విషయంలో కూడా సాంకేతిక వ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఎదురైనట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తాజాగా నివేదించింది. ఇటువంటి ఉదంతాలు డిజిటల్ వ్యవస్థల రూపకల్పన, అధికార పరిధి, జవాబుదారీతనంపై మరింత స్పష్టత అవసరమనే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి.

**భిన్నాభిప్రాయం బలహీనత కాదు**

రాజ్యాంగ సంస్థలో అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు రావడం తప్పనిసరిగా సంస్థ బలహీనతకు సంకేతం కాదు.

నిజానికి ప్రశ్నించడం, అభ్యంతరాలను నమోదు చేయడం, ఒక నిర్ణయాన్ని పునఃపరిశీలించడం- ఇవన్నీ ఆరోగ్యకరమైన సంస్థాగత ప్రక్రియలో భాగమే.

అందువల్ల ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారా అన్నదొక్కటే ముఖ్యం కాదు.

ఆ అభ్యంతరాలను ఎలా పరిష్కరించారు?

వాటిపై ఏ నిర్ణయం తీసుకున్నారు?

ఆ నిర్ణయానికి చట్టపరమైన ఆధారం ఏమిటి?

అవసరమైన చోట ప్రజలకు వివరణ ఇచ్చారా?

**ఇవే అసలు ప్రశ్నలు.**

ఆరోపణలకు ఆధారాలు కావాలి... ప్రశ్నలకు సమాధానాలు కావాలి

ఎన్నికల జాబితాల సవరణ అధికార పార్టీకి ప్రయోజనం కలిగించేలా జరుగుతోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు ఎన్నికల సంఘం, అధికార పక్షం ఇటువంటి ఆరోపణలను ఖండిస్తున్నాయి.

రాజకీయ ఆరోపణను ఆరోపణగానే చూడాలి. ఆధారాలు లేకుండా దానిని నిజంగా నిర్ధారించకూడదు.

అదే సమయంలో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాలు, డేటా భద్రత, చట్టబద్ధ అధికారాలపై తలెత్తే ప్రతి ప్రశ్ననూ రాజకీయ ప్రేరేపితమని పక్కన పెట్టడం కూడా ప్రజాస్వామ్య వ్యవస్థకు మేలు చేయదు. ప్రశ్న ఎవరు అడిగారన్నది కాదు... దానికి సమాధానం ఏమిటన్నదే ముఖ్యం.

ప్రజా విశ్వాసమే అసలైన మౌలిక వసతి

ఎన్నికల సంఘం బలం కేవలం ఎన్నికల తేదీలు ప్రకటించడంలోనో, పోలింగ్ నిర్వహించడంలోనో, ఫలితాలు వెల్లడించడంలోనో లేదు.

**దేశంలోని సామాన్య ఓటరు---**

"నా పేరు ఓటర్ల జాబితాలో సురక్షితంగా ఉంటుంది.

పొరపాటు జరిగితే దాన్ని సరిచేసుకునే అవకాశం ఉంటుంది.

నా పేరును తొలగిస్తే కారణం తెలుస్తుంది.

నేను అప్పీల్ చేసుకోగలను.

నా ఓటుకు సంబంధించిన నిర్ణయాలు చట్టబద్ధంగా జరుగుతాయి."

అని నమ్మగలగడమే ఎన్నికల వ్యవస్థకు అసలైన బలం.

అందుకే ప్రస్తుతం తలెత్తిన ప్రశ్నలను ఎన్నికల సంఘం తనపై దాడిగా కాకుండా సంస్థాగత పారదర్శకతను మరింత బలోపేతం చేసుకునే అవకాశంగా చూడాలి. చట్టపరంగా వెల్లడించగల అంతర్గత విధానాలు, నిర్ణయ ప్రక్రియలు, ఓటర్ల డేటా నిర్వహణ పద్ధతులు, పేర్ల తొలగింపు--పునరుద్ధరణ ప్రమాణాలు, అప్పీళ్ల వ్యవస్థపై సాధ్యమైనంత స్పష్టమైన సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచడం విశ్వాసాన్ని పెంచుతుంది.

ప్రజాస్వామ్యం "మమ్మల్ని నమ్మండి" అనే మాటపై మాత్రమే నిలబడదు.

అది పారదర్శకమైన విధానాలు, చట్టబద్ధమైన నిర్ణయాలు, స్వతంత్ర పరిశీలన, సమర్థవంతమైన అప్పీల్ వ్యవస్థ, ప్రజలకు జవాబుదారీతనం మీద నిలబడుతుంది.

**చివరికి ప్రశ్న ఒక్కటే---**

అర్హత కలిగిన ప్రతి భారతీయుడు తన ఓటు హక్కు సురక్షితమని నమ్మగలుగుతున్నాడా?

ఆ నమ్మకాన్ని మాటలతో కాకుండా వ్యవస్థతో నిరూపించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే.

ఎన్నికలు ఎవరు పాలించాలో నిర్ణయిస్తాయి.

కానీ ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉందో నిర్ణయిస్తుంది.

# విద్యుత్ లైన్లు తగిలి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అన్ని విధాలా సాయం అందిస్తాం

- మొదటి పేజి తరువాయి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాపట్ల మండలంలో తెగిపడిన ఎల్‌టీ విద్యుత్ లైన్ తాకి తల్లి, కుమారుడు మృతి చెందిన ఘటనతో పాటు, నర్సీపట్నం నాతవరంలో విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోవడంపై మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గాయపడిన నాగరాజుకు అత్యుత్తమ వైద్యం అందించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ వైర్లు, స్తంభాల స్థితిగతులను నిరంతరం పరిశీలించాలని స్పష్టం చేశారు. వాయుగుండం వల్ల ఉత్తరాంధ్ర జిల్లాల్లో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తుండటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఈపీడీసీఎల్ పరిధికి అవసరమైన అదనపు సిబ్బందిని, విద్యుత్ మెటీరియల్‌ను ఎస్పీడీసీఎల్ నుంచి పంపించినట్లు తెలిపారు.

ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలినా, వైర్లు తెగిపడినా తక్షణమే సంబంధిత సమీప కార్యాలయాలకు ఫిర్యాదు చేసేలా సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం ఉన్న చోట వాతావరణం అనుకూలించిన వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి, ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్రంలో నేడు కూడా వర్షాలు.. జలాశయాలు నింపండి

- మొదటి పేజి తరువాయి

సీఎం ఆదేశించారు. ప్రస్తుత వర్షాలకు గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, పంపా, మేఘాద్రిగడ్డ రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరనుందని అధికారులు అంచనా వేశారు. గొట్టా బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 25 ఉదయానికి, భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం నాటికి మొదటి, సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయవచ్చని వివరించారు.

**ఎల్‌నినోపై వ్యూహం.. సాంకేతికత వినియోగం**

ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేందుకు భూసారాన్ని పెంచడం, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాలను ప్రోత్సహించాలని చంద్రబాబు అన్నారు. దీనిని రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని ఆదేశించారు. అక్టోబరు 2న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నామని, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చే కార్యక్రమం కూడా అదే రోజు ప్రారంభిస్తామని తెలిపారు. డేటా ఆధారిత పాలనలో భాగంగా అమెరికాలో ఉంటున్న పృథ్వీ అనే యువకుడు రూపొందించిన యాప్‌ను సీఎం పరిశీలించి, అతడిని అభినందించారు.

ఈ సమీక్షలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని,

విద్యుత్ సరఫరా నాణ్యత పెంచాలని, ఇసుక సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సీఎం ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు శాప్ ఆధ్వర్యంలో వార్షిక క్రీడా క్యాలెండర్ రూపొందించాలని సూచించారు. నియోజకవర్గాల్లో అధికారుల పనితీరు మెరుగుపరిచేందుకు నోడల్ అధికారులతో సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

# ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు.. ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట

- మొదటి పేజి తరువాయి

**కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం: యారాకు లోకేశ్ ఆహ్వానం**

పర్యటనలో భాగంగా, నార్వేకు చెందిన ప్రముఖ ఎరువులు, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ వైశాలి చోప్రాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో గ్రీన్-అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట-పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. దీనిపై వైశాలి చోప్రా స్పందిస్తూ, యారా ఇండియా ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1500 అవుట్‌లెట్ల ద్వారా 5.5 మిలియన్ల రైతులకు డిజిటల్‌గా సేవలు అందిస్తోందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

**గోద్రెజ్ ఆగ్రో కెమికల్ యూనిట్‌కు ఏపీ అనువైనది**

ప్రముఖ పారిశ్రామిక సంస్థ గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామితోనూ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గోద్రెజ్ అనుబంధ సంస్థ అజ్‌టెక్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించాలని సూచించారు. దీనికి రాకేశ్ స్వామి స్పందిస్తూ, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఇప్పటికే భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్‌గా ఉందని గుర్తుచేశారు. గత ఏడాది నవంబర్‌లో ఏపీలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్లతో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ద్వారకా తిరుమల మండలంలో రూ.210 కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని స్వామి హామీ ఇచ్చారు.

**ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్: శాప్ తో భేటీ**

జర్మనీకి చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ శాప్ (ూ్ూ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లవ్‌నీష్ చనానాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ గవర్నెన్స్, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ూవీఱ) డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఒక 'డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు ూ్ూ నైపుణ్యాలు, సర్టిఫికేషన్ అందించేందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి పనిచేయాలని సూచించారు.

దీనిపై చనానా స్పందిస్తూ, భారత్‌లో శాప్ ల్యాబ్స్ తమకు రెండవ అతిపెద్ద ఆర్‌డీ హబ్ అని, బెంగళూరులో 15 వేల సీట్లతో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులకు సాంకేతిక సేవలు అందిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

**స్టార్టప్‌ల ప్రోత్సాహానికి భాగస్వాములు కండి: మాస్టర్‌కార్డ్‌కు లోకేశ్ విజ్ఞప్తి**

గ్లోబల్ పేమెంట్స్ టెక్నాలజీ దిగ్గజం మాస్టర్‌కార్డ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (=×ు)లో ఫిన్‌టెక్ సలహాదారుగా చేరాలని ఆహ్వానించారు. ఇప్పటికే రాజమండ్రి, కోనసీమలో మాస్టర్‌కార్డ్ అమలు చేస్తున్న 'ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్' కార్యక్రమాన్ని ఇతర పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. దీనికి అభిషేక్ లాహిరి స్పందిస్తూ,

# ఓటు చోరీ ఇప్పుడు చట్టం చోరీగా మారింది.. సీఈసీ రాజీనామా చేయాలి

**రాహుల్ గాంధీ కామెంట్స్:**

ఉద్దేశపూర్వకంగానే ఓట్ల తొలగింపు

పార్టీలను టార్గెట్ చేసి ఓట్లు తొలగించారు

ఓటు హక్కును కాలరాస్తున్నారు

ఓటు అనేది ప్రజాస్వామ్యానికి పవర్

నేను ఆధారాలు లేకుండా మాట్లాడటం లేదు

రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు

ప్రజల ఓటును కాపాడటం ఈసీ బాధ్యత

సీఈసీ జ్ఞానేష్ కుమార్ మోదీ, షా ద్వారా ఎన్నకోవడ్డ వ్యక్తి..

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కు నేను అడిగిన ప్రశ్నలకు సమాధానం లేదు

ఓటు చోరీ ఇప్పుడు చట్టం చోరీగా మారింది.

ఎంత పెద్ద నేత అయిన కొంత కాలం తర్వాత వ్యతిరేకత ఉంటుంది..

బంగ్లాదేశ్ యుద్ధం తర్వాత ఇందిరాగాంధీ పాపులారిటీ పెరిగింది

ఆ తర్వాత కొంత కాలం తర్వాత ఆమెపై వ్యతిరేక వచ్చింది

మోదీపై వ్యతిరేకతను కనబడకుండా చేస్తున్నారు

వ్యతిరేకత నుంచి బీజేపీ తప్పించుకోవాలని చూస్తోంది

## అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు.. విచారణకు రావాలని ఆదేశం

- మొదటి పేజి తరువాయి

రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. రేపు ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే అంబటి రాంబాబు తన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ స్పందించారు. 15 రోజుల క్రితం గుండెకు స్టంట్‌లు వేయించుకున్నానని, డాక్టర్ల సలహా మేరకు ప్రస్తుతం కోలుకుంటున్నానని తెలిపారు. పూర్తిగా కోలుకున్న తర్వాత ముందుగా సమాచారం ఇచ్చి విచారణకు వస్తానని, తప్పనిసరిగా సహకరిస్తానని మెసేజ్ పంపారు. ఆయన సమాధానంపై ఈడీ అధికారులు ఇంకా స్పందించాల్సి ఉంది. ఇదే కేసులో ఈరోజు మర్రి సుబ్బారెడ్డి, పురుషోత్తమరావుల వాంగ్మూలాలను ఈడీ నమోదు చేసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు లిక్కర్ రవాణా కోసం సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టినట్లు గుర్తించారు.

మొదటి కాంట్రాక్టు కాలంలో వీరిద్దరూ కలిసి సుమారు 59.14 లక్షల మద్యం పెట్టెలు రవాణా చేశారని అధికారులు ప్రశ్నించారు. సిగ్మా సంస్థ నుంచి రూ.15.44 కోట్లు అందుకున్నట్లు విచారణలో వెల్లడైంది. సబ్‌కాంట్రాక్టులు, నిధుల మళ్లింపు, అంబటి రాంబాబుతో ఉన్న సంబంధాలపై కూడా వివరాలు అడిగారు. ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలను అధికంగా పెంచడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ఈడీ లెక్కలు చూపిస్తోంది.

# అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్..

దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై ఛార్జీలు విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వ్యాపార వర్గాలు భగ్గుమన్నాయి. ఈ కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాడు "నో యూపీఐ డే" పాటించాలని పలు వాణిజ్య, వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున తమ దుకాణాల్లోని యూపీఐ క్యూఆర్ కోడ్‌లు, స్కానర్లు, సౌండ్ బాక్సులను నల్లటి వస్త్రంతో కప్పివేసి నిరసన తెలపాలని నిర్ణయించాయి.

**అక్టోబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు**

అక్టోబర్ 15 నుంచి యూపీఐ చెల్లింపులకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం, వ్యాపారులు (ూ2వీ - పర్సన్ టు మర్చంట్) స్వీకరించే రూ.2,000కు పైబడిన ప్రతి యూపీఐ లావాదేవీపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీణ=) చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఒక లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఛార్జ్ చేస్తారు.

అయితే, వ్యక్తుల మధ్య జరిగే (ూ2ూ - పర్సన్ టు పర్సన్) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. అలాగే, నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు (ూ2ూవీ) కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఇచ్చారు. 2026 ఆగస్టు నెలలోనే వ్యాపారులకు రూ.8.95 ట్రిలియన్ల విలువైన 15.51 బిలియన్ల లావాదేవీలు జరగ్గా, అందులో రూ.2,000కు పైబడిన చెల్లింపుల వాటానే సుమారు 67 శాతం ఉండటం గమనార్హం.

**వ్యాపారుల ఆందోళన ఎందుకు?**

తమకు ఇప్పటికే చాలా తక్కువ లాభాలు వస్తుండగా, ఇప్పుడు యూపీఐపై కొత్త ఛార్జీలు విధించడం వల్ల ఆర్థికంగా మరింత భారం పడుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ ఇండియాను ప్రోత్సహించి, పారదర్శక లావాదేవీలు జరుపుతున్న తమను ప్రోత్సహించాల్సింది పోయి, ఇలా ఛార్జీలతో శిక్షించడం సరికాదని వారు వాదిస్తున్నారు. మహారాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (వీూజజ×ూ), ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ (ూ×జూణఖీ) వంటి అనేక జాతీయ స్థాయి సంఘాలు ఈ నిరసనకు మద్దతు ప్రకటించాయి. ఈ అంశంపై పెట్రోలియం డీలర్లు, స్టాక్ బ్రోకర్లు కూడా తమకు మినహాయింపులు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే పెట్రోలియం మంత్రిత్వ శాఖ డీలర్లతో చర్చలు జరపగా, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలపై విధించిన 0.02 శాతం ఎండీఆర్‌పై బ్రోకర్ల ఆందోళనలను పరిశీలిస్తామని సెబీ హామీ ఇచ్చింది. అక్టోబర్ 15 లోగా ప్రభుత్వం ఈ ఛార్జీలను ఉపసంహరించుకోకపోతే తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తామని వ్యాపార సంఘాలు హెచ్చరించాయి.

# యూపీలో కాలి బూడిదైన టూరిస్ట్ బస్సు..

ఉత్తరప్రదేశ్‌లోని యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం జరిగింది. వేగంగా వెళుతున్న ఓ స్లీపర్ టూరిస్ట్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో 9 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఈ బస్సు ఢిల్లీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మహోబాకు సుమారు 30 మందికి పైగా ప్రయాణికులతో బయలుదేరింది. గ్రేటర్ నోయిడా సమీపంలోకి రాగానే బస్సులో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ప్రమాద సమయంలో ప్రయాణికుల్లో ఎక్కువ మంది గాఢ నిద్రలో ఉండటంతో ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే అగ్నికీలలు బస్సును పూర్తిగా చుట్టుముట్టాయి. భయాందోళనకు గురైన కొందరు ప్రయాణికులు కిటికీల నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే జేవార్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## డేటా సెంటర్లకు ఏపీ కొత్త విధానం.. 70 శాతం గ్రీన్ ఎనర్జీ తప్పనిసరి

- మొదటి పేజి తరువాయి

మళ్లించి డేటా సెంటర్ల అవసరాలు తీరుస్తామన్నారు. నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటికే ఒక సంస్థ ఈ దిశగా ముందుకొచ్చిందని వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన లక్ష్యంగా 23 రంగాల వారీగా ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. సిమెంట్, ఆటోమొబైల్ వంటి సంప్రదాయ తయారీ రంగాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రేర్ ఎర్త్ మినరల్స్, బయోమెడికల్, ఫార్మా వంటి ఆధునిక రంగాలకు కూడా ఈ క్లస్టర్లలో చోటు కల్పించామన్నారు. ఏపీలో గూగుల్ భారీ పెట్టుబడి పెడుతోందని, దీని స్ఫూర్తితో మరిన్ని కంపెనీలు డేటా సెంటర్ల రంగంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. అమరావతి కేంద్రంగా క్వాంటం టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఐబీఎం నుంచి 150-క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతికి తీసుకొచ్చిన తొలి రాష్ట్రం ఏపీ అని గుర్తుచేశారు. ఈ సాంకేతికతకు అవసరమైన క్రయోజెనిక్స్, మెటీరియల్ సైన్సెస్ వంటి అనుబంధ రంగాలనూ అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు అన్ని రంగాల్లోనూ రాణించాల్సి ఉంటుందన్నారు. క్వాంటం టెక్నాలజీ ఎంత ముఖ్యమో, హార్టికల్చర్, ఆక్వాకల్చర్ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. అక్టోబర్ 2న దాదాపు రూ.1 లక్ష కోట్లతో హార్టికల్చర్ మిషన్‌ను ప్రారంభిస్తున్నామని, హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (×ూది) తరహాలో "ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్"ను ఏర్పాటు చేసి వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహిస్తామని ప్రకటించారు.

## చైనా, అమెరికా ప్రత్యర్థులు కాదు..పార్టనర్స్

- మొదటి పేజి తరువాయి

సాగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. చైనా, అమెరికా రెండు గొప్ప దేశాలని, రెండు దేశాల ప్రజలు గొప్పవారని జిన్ పింగ్ తన సోషల్ మీడియా ప్లాట్ ఫాంలో రాశారు. మే నెలలో చైనా పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు, ద్వైపాక్షిక సంబంధాల మెరుగుపర్చుకునేందుకు ట్రంప్ అంగీకరించినట్లు జిన్ పింగ్ తెలిపారు. ఆ దిశలో పని చేయాలని, పరస్పరం సహకరించుకోవాలని, శాంతియుత హామీలతో కూడిన స్థిరమైన సంబంధాన్ని పెంపొందించుకోవాలని జిన్ పింగ్ ఆకాంక్షించారు.

## 48 గంటల్లో రాజీనామా చేయాలి..

- మొదటి పేజి తరువాయి

గుప్పించిన సీజేపీ ఆయనను దేశద్రోహిగా అభివర్ణించింది. జజుజ రాజీనామాతో పాటు, ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కూడా జబ్రూ డిమాండ్ చేసింది. ఓటర్ లిస్టు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేయాలని కూడా సీజేపీ డిమాండ్ కోరింది.

**జ్ఞానేష్ కుమార్ పై అభిజీత్ దిప్కే విమర్శలు..**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని ఆరోపించారు దిప్కే. జ్ఞానేష్ కుమార్ ఎవరు ఓటు వేయాలి, ఎవరు ఓటు వేయకూడదని అర్హతను నిర్ణయించడాన్ని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ప్రజాస్వామ్య భావననే తలకిందులు చేసిందని , జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపులో జ్ఞానేష్ కుమార్ పాత్ర ఉందని, అతనే అతిపెద్ద దేశద్రోహి అని దీప్కే ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి.. జ్ఞానేష్ కుమార్ చర్యలతో దేశంలోని ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పు అని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని ఓటర్ల పేర్లను తొలగించే లక్ష్యంగా ఓ సిస్టమ్ పనిచేసిందని దిప్కే ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఏకమైన అనేక ప్రాంతీయ నేతలను భారీ సంఖ్యలో ఓట్లు తొలగించడం ద్వారా ఓడిపోయేలా చేశారని దీప్కే అన్నారు. సర్ తో ఓట్ల తొలగింపు, బీజేపీకి కేంద్ర ఎన్నికల సంఘం చేసిన మేలును దీప్కే బట్టబయలు చేశారు. 2024 ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించలేకపోయింది. మెజారిటీ రాకపోవడంతో వారు ఆందోళనకు గురయ్యారు. '400 పార్' అనే నినాదం ఇచ్చినప్పటికీ, వారు 240 సీట్లకు పరిమితమయ్యారు. ఆ తర్వాత, దేశంలో ప్రజాభిప్రాయం మారుతోందని, ప్రాంతీయ శక్తులు బలపడపడ్డాయని గ్రహించిన బీజేపీ, ఎలక్షన్ కమిషన్ చీఫ్ కుట్రకు తెరలేపారని జబ్రూ వ్యవస్థాపకుడు ఆరోపించారు. ఎన్నికల్లో ప్రతిపక్ష నేతలు, ప్రాంతీయ పార్టీల చీఫ్ ల ఓటమిపై ప్రస్తావిస్తూ .. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు ,ఢిల్లీ ఉదాహరణలను ఎత్తిచూపారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రే, ఎన్‌సీపీ (చీబ్రూ), ఎం.కె. స్టాలిన్, పినరయి విజయన్, అరవింద్ కేజ్రీవాల్ , మమతా బెనర్జీ... ఇలా ఈ ముఖ్యమంత్రులందరూ ఒక్కొక్కరుగా ఓడిపోయారు. ఇది యాదృచ్ఛికం కాదని, 2024 ఎన్నికల్లో ఉమ్మడిగా ప్రచారం చేసిన వారంతా ఒక్కొక్కరుగా ఎలా ఓడిపోయారని దీప్కే ప్రశ్నించారు. వీరందరి ఓటమి వెనక పక్కా ప్రణాళిక ఉందన్నారు.

# పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు శుక్రవారం సెలవు

**డీ-వార్మింగ్ డే సోమవారానికి వాయిదా**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** తుఫాను, భారీ వర్షాల నేపథ్యంలో పోలవరం జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు శుక్రవారం (సెప్టెంబర్ 25) సెలవు ప్రకటించినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు. విద్యార్థులు, చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించాల్సిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (డీ-వార్మింగ్ డే) కార్యక్రమాన్ని సెప్టెంబర్ 28 సోమవారానికి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు విద్యా, వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జేసీ సూచించారు.



పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి






**పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 24:** తూర్పు గోదావరి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో స్పాన్సర్‌షిప్, పీఎం కేర్స్ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న పిల్లలు, వారి సంరక్షకులతో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమాన్ని గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్ లో బహుమతులు అందజేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఈ కార్యక్రమంలో పాల్గొని పిల్లలతో నేరుగా మాట్లాడి వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పిల్లలతో మాట్లాడటం, వారి చదువు, అభిరుచులు, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను తమ సొంత పిల్లల్లా చూసుకుంటూ వారికి అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యులు, సంరక్షకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జీవితంలో ముందుకు సాగిన ప్రతి ఒక్కరి ప్రయాణంలోనూ ఏదో ఒక దశలో కష్టాలు, ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయని, చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోవడం వంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ధైర్యంగా అధిగమించాలని పిల్లలకు సూచించారు. పరిస్థితులను చూసి నిరాశ చెందకుండా పట్టుదలతో చదివి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇతరులతో తమను తాము పోల్చుకుని కృంగిపోవద్దని, ప్రతి ఒక్కరి పరిస్థితులు, అవకాశాలు వేర్వేరుగా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. బాగా చదువుకోవాలనే సంకల్పం, కష్టపడే తత్వం ఉంటే పిల్లల లక్ష్య సాధనకు ప్రభుత్వం, సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. తమకు ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని సీడీపీవో శ్రీదేవి వివరించారు. స్పాన్సర్‌షిప్, పీఎం కేర్స్ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న పిల్లలకు అవసరమైన సదుపాయాలు, విద్య, ఇతర అవసరాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కోవిడ్ సమయంలో జిల్లా వ్యాప్తంగా తల్లి తండ్రులను కోల్పోయిన అనాథలు, తల్లి లేదా తండ్రిలో ఒకరిని కోల్పోయిన అనాథలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలు, హెచ్ఐవీ ప్రభావిత పిల్లలు కలిపి మొత్తం 660 మంది పిల్లలు "పిఎం కేర్" స్పాన్సర్‌షిప్ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన 10 మంది పిల్లలకు పీఎం కేర్స్ పథకం ద్వారా సహాయం అందిస్తున్నామని వివరించారు. పీఎం కేర్స్ కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించబడుతుందని, ఈ మొత్తాన్ని పిల్లలకు 23 సంవత్సరాల వయస్సు పూర్తయిన అనంతరం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పిల్లలు, యువతతో జిల్లా కలెక్టర్, అధికారులు ముఖాముఖిగా మాట్లాడి వారి అనుభవాలు, విద్యా పరిస్థితులు, భవిష్యత్ లక్ష్యాలను తెలుసు కున్నారు. పిల్లలు తమకు ఎదురవుతున్న సమస్యలు, అవసరాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఐటీఐ, సాంకేతిక విద్య ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని కలెక్టర్ కీర్తి చేకూరి వివరించారు. పదో తరగతి అనంతరం వృత్తి విద్యా కోర్సులు, ప్రస్తుతం డిమాండ్ ఉన్న సాంకేతిక నైపుణ్యాలను అభ్యసిస్తే ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు. కొంతమంది యువత తమ స్వయం ఉపాధి ఆలోచనలు, అవసరమైన యంత్ర పరికరాల కొనుగోలుకు సహాయం వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి అవసరమైన సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిన్నారులు యశస్వి, 2వ తరగతి, భారతీయ విద్యా భవన్, పాలకొల్లు; జాహ్నవి, 5వ తరగతి, శ్రీ సత్యసాయి విద్యానికేతన్, పాత తుంగపాడు తదితరులు కలెక్టర్‌తో మాట్లాడారు. పిల్లల చదువు, భవిష్యత్ లక్ష్యాలు, వారి అభిరుచులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన సందర్భాల్లో వారిని ఓదార్చేందుకు మొబైల్ ఫోన్లను అందించిన పరిస్థితులు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ తరగతులు, విద్యా కార్యక్రమాల కారణంగా కూడా పిల్లల్లో మొబైల్ వినియోగం పెరిగిందన్నారు. మొబైల్ ఫోన్‌ను విద్యాభ్యాసం, సందేహాల నివృత్తి, విద్యా సమాచారం తెలుసుకోవడం, తల్లిదండ్రులతో సంప్రదింపులు వంటి సానుకూల ప్రయోజనాలకు పరిమితంగా వినియోగించుకోవాలని సూచించారు. అధికంగా, పర్యవేక్షణ లేకుండా వినియోగిస్తే పిల్లలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున సంరక్షకులు తగిన శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు, సిబ్బంది, బాలల సంక్షేమ కమిటీ ఛైర్పర్సన్ జె సంతోషి కుమారి, హరితదలం ఎన్ జీ వీ వై. చిట్టిబాబు, ప్రతినిధులు, సంరక్షకులు, స్పాన్సర్‌షిప్ మరియు పీఎం కేర్స్ పథకాల లబ్ధిదారులైన పిల్లలు, యువత తదితరులు పాల్గొన్నారు

## అధిక వర్షాల నేపథ్యంలో 24x7 జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు




**ప్రజలకు తక్షణ సమాచారం, సహాయం అందించాలి**

**కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 24:** వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో అధిక వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని స్థాయిల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని రెవెన్యూ డివిజన్, మండల స్థాయిల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ అందుబాటులో ఉంచాలని కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కంట్రోల్ రూమ్‌లకు వచ్చే ఫోన్ కాల్స్‌ను సిబ్బంది నిరంతరం స్వీకరిస్తూ, ప్రజలు అందించే సమాచారం, ఫిర్యాదులు, అత్యవసర పరిస్థితులను సంబంధిత అధికారుల దృష్టికి వెంటనే తీసుకెళ్లి తగిన సహాయం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాలు, వరదలు, రహదారులపై నీటి ప్రవాహం, చెట్లు లేదా విద్యుత్ స్తంభాలు పడిపోవడం, ఇతర అత్యవసర పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు సంబంధిత కంట్రోల్ రూమ్‌లకు తెలియజేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారం, సహాయాన్ని ఎప్పటికప్పుడు అందిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లాలోని కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 08832944455 ను అవసరమైతే సంప్రదించాలని చెప్పారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తమ పరిధిలోని కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించి సమాచారం అందించాలని, అధికారులు ఆ సమాచారంపై తక్షణమే స్పందించి అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు.

## తుఫాన్ దాటికి పొంగిపోర్లిన వాగులు పలు ప్రాంతాలు చాలా దిగ్బంధం.





**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 24** ఎల్ నినో ప్రభావం తో ఎక్కడ వర్షాలు పడక పంటలు వేయక కొంత అది తక్కువ శాతం చేసిన రైతులు కొంత నష్టపోయి దిక్కులేని స్థితిలో వరుణ దేవుడు తుఫాన్ మార్గంలో కరుణించాడు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కొడుతున్న వర్షాలకు గోకవరం మండలం లోని వాగులు వంకలు పొంగిపొర్లడం పలు ప్రాంతాలు జలదిగ్బంధం అయ్యాయి. ఏజెన్సీ ప్రాంతాల నుంచి విపరీతంగా వచ్చిన వరద నీరు కారణంగా బురద కాలవ ఉధృతంగా ప్రవహించింది. సూది కొండ అటవీ ప్రాంతం నుండి విపరీతమైన వరద నీరు రావడంతో సూరంపాలెం కెనాల్ ఠాకూర్ పాలెం జంక్షన్ వద్ద మూడు అడుగుల మేర రోడ్డుపై నీరు నిలిచిపోవడం తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రంప ఎర్రం పాలెం గోకవరం రహదారిలో సర్రా వారి చెరువులోకి వచ్చే ఊరకాలవ రాజమహేంద్రవరం కు చెందిన ఒకరియల్టర్ ఆక్రమించడంతో తన ప్రవాహదిశ మార్చుకుని పక్కనే ఉన్న పొలాలను ముంచేశాయి. తంటికొండ లోని బదిరెడ్డి వారి చెరువు పొంగిపొర్లడం తో చుట్టుపక్క ఉన్న పొలాలు రోడ్డులు జలదిగ్బంధం అయ్యాయి. బొమ్మల దొడ్డి కోరుకొండ మధ్యలోనే వర్షపు నీరు పోయే మార్గం లేక సుమారు అర కిలోమీటర్ మేరకు జాతీయ రహదారిపై నీరు నిలిచిపోయింది. అచ్యుతాపురం సమీపంలోని బురద కాలువ ప్రవాహ దాటికి అనేక చెరువులో వాగులు, వంకలు , పొలాలు నీట మునిగి వయ కోరుకొండ మండలం శ్రీరంగపట్నం ను ముంచెత్తింది. వివిధ గ్రామాలలోనే సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోవడం జరిగింది. రంప ఎర్రంపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ మెయిన్ గేటు ఎదురుగా డ్రైనేజీ వాళ్ళు నిర్వహణ సక్రమంగా లేక సుమారు పది మీటర్ల వెడల్పు 50 మీటర్ల పొడవు వరకు రోడ్డు చుట్టుపక్కల ఉన్న దేవాలయాలు ఇల్లు జలతిగ్బంధంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఇదే గ్రామంలో ఆర్ అండ్ బి రహదారి సబ్బిశెట్టి వారి సెంటర్ నుండి పళ్ళపు వీధి రామాలయం వరకు నీరు పోయే మార్గం లేక రోడ్డుపైనే రెండు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో ఇంటిలోంచి బయటకు రాలేని పరిస్థితిలో ఆ ప్రాంతం వాసులు ఇబ్బందులు గురయ్యారు. ఏది ఏమైనా వర్షాలు లేవు మహాప్రభువు అంటూ కన్నీరు పెట్టిన రైతులు గోడు తుఫాను రూపంలో వరుణ దేవుడు ఆలకించి ఎక్కడికి అక్కడే ఎడతెరిపి లేకుండా వర్షం తుఫాను రూపంలో రావడంతో గోకవరంలోని అరవపేటలో ఎక్కడ నీరు అక్కడే ఇండ్ల మధ్యలో నిలిచి పోయింది .

## ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజల రాకపోకలను అరికట్టాలి



- ★ పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి
- ★ ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేకాధికారి.. 24 గంటలూ పర్యవేక్షణ
- ★ జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్

**గంగవరం/రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మండలాల వారీగా వర్షాలు, వరద పరిస్థితులు, ప్రజల భద్రత, సహాయక చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించినప్పుడు కొన్ని చోట్ల అధికారుల సూచనలకు అనుగుణంగా రక్షణ చర్యలు అమలు కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ కొందరు ప్రజలు పోలీస్, రెవెన్యూ శాఖలకు సమాచారం లేకుండా వాగులు, వరద ప్రాంతాలు, చేపల వేట ప్రాంతాలకు వెళ్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా నిరంతరం అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన చోట్ల కఠినంగా అడ్డుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేకాధికారి**

ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించి వరద ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలూ నిరంతర పర్యవేక్షణ, గస్తీ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**విద్యుత్ పునరుద్ధరణకు వేగం**

భారీ వర్షాల కారణంగా మారేడుమిల్లి, వి.ఆర్.పురం తదితర ప్రాంతాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న విద్యుత్ తీగల పునరుద్ధరణ పనులను విద్యుత్ శాఖ అధికారులు వేగవంతం చేస్తున్నట్లు టెలీకాన్ఫరెన్స్‌లో తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

**ప్రతి రెండు గంటలకు పరిస్థితులపై నివేదిక**

వర్షాలు పూర్తిగా తగ్గే వరకు జిల్లాలోని ప్రతి మండలంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పరిస్థితుల నివేదికలను సమర్పించాలని స్పష్టం చేశారు. వర్షపాతం, వరద ఉధృతి, ప్రమాదకర ప్రాంతాల్లో పరిస్థితి, ప్రజల తరలింపు, పునరావాస కేంద్రాల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# తాగునీరు వృథా... పొంచి ఉన్న కాలుష్యం





నిద్రపోతున్న యంత్రాంగం

**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 24:**ఉంగుటూరు సీపీడబ్ల్యూ పథకం ద్వారా రావులపర్రు, కాగుపాడు, దొంతవరం, పొట్టిపాడు, కాకర్లమూడి, తోట రామచంద్రపురం, వీఏపురం తదితర గ్రామాల్లో 35 వేలకు పైగా ప్రజలకు అందుతున్న రక్షిత తాగునీటి ప్రధాన పైపులైన్ లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి వృథాతో పాటు కాలుష్య ముప్పు పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉంగుటూరు--రావులపర్రు మార్గంలో పలుచోట్ల వాల్వుల నుంచి నీరు లీకై వెల్ సంపుల్లోకి చేరి, అవి నిండిపోయి రహదారి పక్కనున్న పంట బోదెల్లోకి నీరు వృథాగా ప్రవహిస్తోంది. ఇదే సమయంలో నిండుగా ఉన్న సంపుల వద్ద కొందరు ద్విచక్ర వాహనదారులు వాహనాలను కడగడం, ఇతర అవసరాలకు నీటిని వినియోగించడం వల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఉంగుటూరులో నీటిని శుద్ధి చేసి పైపుల ద్వారా గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు లీకేజీలపై దృష్టి సారించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పైపులైన్ లీకేజీలను అరికట్టి తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కలుషిత నీటి కారణంగా ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తితే బాధ్యత ఎవరిదని అధికారులను ప్రశ్నిస్తున్నారు.



## భారీ వర్షాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**భారీ వర్షాలలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. గురువారం నగరపాలక అధికారులతో కలిసి ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు, బాలాజీపేటలో పర్యటించారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో పరిస్థితిని అంచనా వేసుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలన్నారు. వర్షపు నీరు నిలిచే పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరా సహా అన్ని కీలక వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదకర హోర్డింగులను వెంటనే తొలగించాలన్నారు. కూలిన చెట్లను తొలగించడంతో పాటు అవసరమైన చోట చెట్ల కొమ్మలను కత్తిరించాలన్నారు. కంట్రోల్ రూమ్ 9494060060 నెంబర్ 24 గంటలూ పనిచేయాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని.. ప్రభుత్వ సహాయక చర్యలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో ఈఈ మాధవి, ఎంహెచ్ఓ వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అడ్డతీగల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు.నేలకొరిగిన భారీ వృక్షాలు..





**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 24;** అడ్డతీగల మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపు లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. మండలంలో పెద్దేరు వాగు, మదేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రముతో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

మండలంలో పనుకురాతిపాలెం, కొత్తపాలెం, పింజరకొండ , డి. కృష్ణవరం, ఉప్పలపాడు గ్రామాలకు ఏ గ్రామంతోను సాసంబంధాలు లేవనే చెప్పవచ్చు, పొంగిపొర్లుతున్న వాగులు ఈ గ్రామాల సరిహద్దుగుండా ప్రవహించడం దీనికి కారణం. అయితే అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు వాగుల వైపు ఎవరూ రాకుండా హెచ్చరికల బోర్డులు పెట్టి తమ సిబ్బందిని వాగులు వెంబడి ఎవరు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అయితే మండల కేంద్రంతో రాకపోకలు నిలిచిపోవడంతో ఈ ఐదు గ్రామాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో అధికారులు ఎప్పటికప్పుడు వారి బాగోగులను తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. వైద్య సిబ్బంది అవసరమైన మందులు ,త్రాగునీరు వీరికి ఎంతైనా అవసరం. అయితే నిత్యవసర సరుకులు వీరికి అందే పరిస్థితి అంతంత మాత్రమే వర్షాకాలం వచ్చిందంటేనే వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల ప్రతిసారి ఈ గ్రామస్తులకు ఈ ఇబ్బంది తప్పడం లేదు. అలాగే దుప్పలపాలెం రహదారిపై భారీ వృక్షం నేలకు వరగడంతో ట్రాఫిక్ స్తంభించింది, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా మండల కేంద్రంలో జనజీవనం స్తంభించింది ,బుధవారం సగటున 43 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

## 5వ డివిజన్లో రూ.43.50 లక్షలతో తాగునీటి పైప్‌లైన్



ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**స్థానిక 5వ డివిజన్ మఠం వీధిలో తాగునీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు చేపట్టినట్లు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. రూ.43.50 లక్షల అంచనా వ్యయంతో నూతన తాగునీటి పైప్‌లైన్ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మఠం వీధిలో సుమారు 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పీవీసీ పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురవు తోందన్నారు. లీకేజీలు ఏర్పడి తాగునీరు కలుషితమయ్యే సమస్య తలెత్తుతోందన్నారు. మఠం వీధితో పాటు పరిసర వీధులకు కూడా నూతన పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరా చేపడుతున్నట్లు వివరించారు. పనుల్లో నాణ్యత లో రాజీ పడకుండా నెల రోజుల్లో పనులను పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రూ.2 కోట్లు నగదుతో ఉడా యించిన నిందితులు అరెస్ట్

సొమ్ము రూ.1,99 కోట్లు- ను స్వాధీనం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**ఈనెల 21 తేదీన ఉదయం 07:40 గంలకుదానవాయిపేట లో గల ఎస్ బి ఐ రీజినల్ ఆఫీసు వద్ద కందుల సురేష్ కుమార్, తన డ్రైవర్ పాండూరి సాయి శివకు బ్యాంకులో జమ చేయాల్సిన రూ.2 కోట్లు నగదును కారులో 2 సంచులలో పెట్టి జిమ్ కు వెళ్లడం జరిగింది. తిరిగి ఉదయం 08:45 వచ్చేసరికి డ్రైవర్ (నిందితుడు) రూ.2 కోట్లు నగదుతో పరారై మొబైల్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీంతో ఫిర్యాదుదారు అదే రోజు స్థానిక ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా క్రైం నం: 216/2026 కేసు రిజిస్టర్ చేయడం జరిగింది. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ , సెంట్రల్ జోన్ ఇంచార్జ్ పాటిల్ దేవరాజ్ మనీష్, పర్యవేక్షణలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎన్ .మురళీ కృష్ణ సబ్ ఇన్స్పెక్టర్ జె .ఆదినారాయణ, సిబ్బంది ఈ కేసులో ముద్దాయిలు అయిన ఏ 1పండూరి సాయిశివ, ఏ 2. అప్పాబత్తుల దుర్గా వర ప్రసాద్, ధవళేశ్వరం, ఏ 3. పండూరి వీర వెంకట సత్య ప్రసాద్, ధవళేశ్వరం లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి దొంగిలించిన సొమ్ము లోరూ.1,99,25,000/- ను రికవరీ చేయడం జరిగింది.

ఈ కేసును ను త్వరితగతిన చేధించి, రికవరీ చేసిన × టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎన్ .మురళీ కృష్ణ, సబ్ ఇన్స్పెక్టర్ జె .ఆదినారాయణ, హెడ్ కానిస్టేబుల్ జి .నాగమునీంద్ర , కానిస్టేబుల్ లు కె.సోమేష్, జి.సుమన్, పి.పోసయ్య లను ఎస్పీ డి.నరసింహ కిషోర్ , జిల్లా తూర్పుగోదావరి అడిషనల్ ఎస్పీ అడ్మిన్ , సెంట్రల్ జోన్ ఇంచార్జ్ పాటిల్ దేవరాజ్ మనీష్, అభినందించినారు.

## గంగవరం మండలంలో భారీ వర్షాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవాగులు..
జలమయమైన లోతట్టు ప్రాంతాలు

**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**గంగవరం మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు, కాలువల్లో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని కన్నేరు, పెద్దేరు, దొంగ కాలువ, జువ్వమ్మ కాలువ, పెద్ద కాలువ తదితర వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వాగుల ఉధృతి పెరగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీరు ఇళ్ల పరిసరాల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో వ్యవసాయ భూములు సైతం నీట మునిగే పరిస్థితి ఏర్పడింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని స్థానికులు సూచిస్తున్నారు. వర్షాలు మరింత కొనసాగితే పరిస్థితి ఎలా ఉంటుందోనని గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు వాగులు, లోతట్టు ప్రాంతాల పరిస్థితిని పర్యవేక్షించి ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## వర్షపు నీరు నిలవకుండా చర్యలు

**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 24:**వర్షాల కారణంగా రహదారులు, వీధుల్లో నీరు నిలవకుండా తగిన చర్యలు చేపట్టినట్లు ఉంగుటూరు తహాశీల్దారు మద్రపు సన్యాసిరావు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. వీధుల్లో నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ జేసీబీల సహాయంతో పూడికలు తొలగించి నీటిని మళ్లించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నారాయణపురం రైల్వే అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలిచిన విషయాన్ని గుర్తించి, నీటిని తొలగించేలా చర్యలు చేపట్టినట్లు తహాశీల్దారు సన్యాసిరావు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా నీరు నిలిచినట్లు గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## ప్రశాంతంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు



**సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్: 24** :తుఫాన్ ప్రభావం ఉదయం నుండి ఏడ తెలివిలేని వర్షం కురుస్తూనే ఉంది. భారీ వర్షాలు సైతం లెక్కచేయకుండా మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. సీతానగరం పోలిసువారి ఈ కార్యక్రమం కు బందోబస్తు ఏర్పాటు చేశారు. బొబ్బిలంక, సీతానగరం, వంగలపూడి , సింగవరం, తదితర గ్రామాల్లో గురువారం నాడు మేళ తాళాలతో అంగరంగ వైభవంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగించారు. మండలంలోని విగ్రహాలను వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

## ఈనెల 26 నుంచి అక్టోబరు 2 వరకు ఉంగుటూరు రైల్వే గేటు మూత



**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 24:**ఉంగుటూరు రైల్వే గేటును ఈనెల 26వ తేదీ ఉదయం 6 గంటల నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వారం రోజులపాటు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు ఉంగుటూరు పంచాయతీ అభివృద్ధి అధికారి బీవీ రవిచంద్రకుమార్ తెలిపారు. విజయవాడ--విశాఖపట్నం రైలు మార్గంలో ట్రాక్ పటిష్టత, నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో రైల్వే క్రాసింగ్ గేటును మూసివేస్తున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని సహకరించాలని అధికారులు సూచించారు.

## నగరంలో అక్టోబర్ 8, 9 తేదీల్లో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు

కమిషనర్ రాహుల్ మీనా చే టీజర్ ఆవిష్కరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలకు నగరం మరోసారి వేదిక కానుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో అక్టోబర్ 8 , 9 తేదీల్లో నగరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో వారోత్సవాలు జరగనున్నాయి. నగరపాలక సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యం లో ఇస్రో ఈ కార్యక్రమం నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఇస్రో సివిల్ డివిజన్ హెడ్ వి.లక్ష్మణ సతీష్, సీనియర్ శాస్త్రవేత్త కె.అశ్విని గురువారం కమిషనర్ రాహుల్ మీనా ను ఆయన ఛాంబర్ లో కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఇస్రో చేపట్టిన ప్రయోగాల రాకెట్ నమూనాలు ఈ వారోత్సవాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. 6 తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, స్పాట్ క్విజ్, స్పాట్ ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించ డం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగ పరచుకోవలసిందిగా సూచించారు. అనంతరం టీజర్ ను ఆవిష్కరించారు.

# అనాథ పిల్లలకు పీఎం కేర్స్ లో చదువు, ఉపాధికి ప్రభుత్వ చేయూత









**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ముఖాముఖి కార్యక్రమం ద్వారా పి ఎం కేర్ లబ్ధిదార పిల్లల అవసరాలు, సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీడీపీఓ టీ. శ్రీదేవి తెలిపారు. జిల్లాలో అనాథలు, అర్ధ అనాథలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలు, హెచ్ఐవీ ప్రభావిత పిల్లలు కలిపి 660 మంది స్పాన్సర్‌షిప్ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన 10 మంది పిల్లలకు పీఎం కేర్స్ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు.
కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల భవిష్యత్తుకు పీఎం కేర్స్ పథకం అండగా నిలుస్తోందని లబ్ధిదారులు తెలిపారు.
గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పీఎం కేర్స్, స్పాన్సర్‌షిప్ పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. గోకవరం మండలం గోకవరం గ్రామానికి చెందిన పెరువలి సత్యనారాయణ మాట్లాడుతూ, తన కుమారుడు పెరువలి రాజేష్ 2021లో కోవిడ్ బారినపడి మృతి చెందారని, ఆయనకు హరీన్, శశి అనే ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, పీఎం కేర్స్ ఫండ్ మరో రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షల ఆర్థిక భరోసా లభించిందన్నారు.
కొవ్వూరుకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని – సి.హెచ్. మేరీ లలిత హేమలత కుమారి మాట్లాడుతూ, కోవిడ్ రెండో దశలో తాను ఏడో తరగతిలో తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయానని తెలిపారు. . పీఎం కేర్స్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిందని, ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నత విద్యను కొనసాగిస్తున్నానని తెలిపారు.నగరానికి చెందిన రేష్మంత్ నాగసాయి మాట్లాడుతూ, పాఠశాలలో చదువులోనే తల్లిదండ్రులను కోల్పోయానని, పీఎం కేర్స్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరో రూ.10 లక్షలు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ప్రస్తుతం ఐటీఐ పూర్తి చేశానని, అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు.

## మండలప్రజల భద్రత మాభాధ్యత,



**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.24:** మండలప్రజలభద్రత మాభాధ్యత,అంటూపోలీసు సిబ్బంది.రెవెన్యూసిబ్బంది.ముందుగానేఅప్రమత్తం అయ్యారు.తుపానుకారణంగా బారీవర్షాలురావడం తోమండలంలోనిఅన్నవరంవాగు, సీతంపేటవాగు, జల్లివారిగూడెంవాగు,తదితరగ్రామాలలోచెరువులు, కాలువలు, వాగులు,వంకలు,వరదనీటితోఉధృతంగా ప్రవహిస్తున్నాయని, వాహనదారులుమండలప్రజలు అప్రమత్తంగాఉండాలని,అత్యవసరమైతే,తప్పాబయటకురావద్దని,వి.ఆర్.పురంఎస్.ఐ.సాధిక్,కోరారు. వర్షాలువస్తున్న, సమయంలోచేపలువేటకువెళ్లవద్దని, అనుకోకుండా జరిగేసంఘటనలు ద్వారామీవిలువైన, ప్రాణాలనుపోగొట్టుకునేలాచేసుకోవద్దని,సూసించారు. ఈకార్యక్రమంలోపోలీసుసిబ్బంది.రెవెన్యూసిబ్బంది. తదితరులుపాల్గొన్నారు.

## ఇందుకూరి సేవలు ప్రశంస నీయం- రామకృష్ణం రాజు 90 వ పుట్టినరోజు వేడుకలు

- వేగేశ్న వేంకట భాస్కర్ రాజు
- క్షత్రియ సేవా సమాఖ్య అధ్యక్షులు.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 24:** మాజీ మంత్రివర్యులు ఇందుకూరి రామకృష్ణం రాజు 90 వ పుట్టినరోజు వేడుకలు లో సన్మానం జరిపి జ్ఞాపిక ను అందించిన తాడేపల్లిగూడెం క్షత్రియ సేవా సమాఖ్య సభ్యులు ప్రసిడెంట్ వేగేశ్న వెంకట భాస్కరరాజు సెక్రెటరీ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణశీరాజు ట్రెజరర్ గాదిరాజు వెంకట రామరాజు మాజీ ప్రసిడెంట్ చెరుకు వాడ అప్పలరామకృష్ణ వర్మలు పిప్పర లో జరిగిన పుట్టినరోజు సేవా కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు. మంత్రిగా నియోజకవర్గం అభివృద్ధి నే కాక అనేక పదవులు చేపట్టి నీతి నిజాయితీ గల నాయకులు గా పేరొందిన ఇందుకూరి మరిన్ని పుట్టినరోజు లు జరుపుకోవాలని షాలువాలు పూల గుచ్చాలు బుక్స్. జ్ఞాపిక మెమశీటో అందించారు. ఈ కార్యక్రమం లో సమాఖ్య సభ్యులు పెన్మేత్స సూర్యనారాయణ రాజు, విస్సశీరాజు పెన్మత్స ఫణింద్ర రాజు, దాట్లజగన్నాధరాజు వేగేశ్న రాజీవ్, ఆంజనేయరాజు, అల్లూరి వెంకట రామరాజు, కొలనువాడ శివరామ రాజు. సోమరాజు విజయ భాస్కరరాజ లయన్ దాట్ల లక్ష్మిపతిరాజు శివాజీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్న నందమూరి కాలువ





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 24:** అకాల వర్షాల నేపథ్యంలో నందమూరి కాలువ నీటిమట్టం 29 మీటర్లకు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్న నందమూరి కాలువను తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఽ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కాలువను స్వయంగా పరిశీలించారు.కాలువలో నీటి ప్రవాహ పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకుని, ప్రజలు మరియు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తదితర శాఖల అధికారులు, స్థానిక నాయకులు, ఎన్డీఏ నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావంతో పొంగిపొర్లుతున్న సెలయేర్లు





**వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** తుఫాన్ ప్రభావంతో వై రామవరం గుర్తేడు మండలాల్లో ఉన్న సెలయేర్లు, కొండ కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి.
గత 48 గంటల నుండి తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు వై. రామవరం, అడ్డతీగల మండలాల సరిహద్దుల్లో ఉన్న పెద్దేరు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తుంది. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎట్టి పరిస్థితులలోనూ కొండ కాలువలు సెలయేర్ల వద్దకు వెళ్ళవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వై. రామవరం మండలంలో ఉన్న పెద్దేరు, కన్నేరు, గుర్రమంద కాలువ, దుమ్మ కొండ కాలువ, గడప రాళ్ల కాలువ, కాకులు మామిడి కాలువ పొంగిపొర్లుతున్నాయి అని తెలిపారు. గుర్తేడు మండలంలో ఉన్న పెల్లి పడుగు కాలువ, బచ్చులూర్ దగ్గర ఉన్న కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా కాలువల సమీపంలో ఉన్న స్వర్ణ గ్రామ కార్యాలయం సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని ఎంపీడీవో కే బాపన్నదొర తెలిపారు.

## వినాయక లడ్డూ దక్కించుకున్న యాదవ సోదరులు





**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 24;** తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పాత ఆంధ్రా బ్యాంకు బజార్ లోని వరసిద్ధి వినాయక లడ్డూ ప్రసాదాన్ని వేలం పాటలో గురువారం ఆంధ్ర ప్రదేశ్ ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం తాటి యాకులగూడెం గ్రామానికి చెందిన యాదవ సోదరులు మామిళ్ల బలరాం, అద్దాల మల్లికార్జున రావు రూ. 63,000/- లకు దక్కించుకున్నారు. 9 రోజులు అత్యంత వైభవంగా పూజలు అందుకున్న స్వామివారి లడ్డూ ప్రసాద వేలం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలవరం నియోజకవర్గ జనసేన నాయకులు మేకల మంగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన పండితులు సత్యనారాయణ శర్మ చేతుల మీదుగా మామిళ్ల బలరాం – శ్రావణ సంధ్య దంపతులు మరియు అద్దాల మల్లికార్జునరావు అద్దాల భార్గవి దంపతులకు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.
ఈ కార్యక్రమాన్ని తాటి యాకులగూడెం గణేష్ కమిటీ సభ్యులు కుందేటి వీర్రాజు, మామిళ్ల నాగరాజు, మేకల మంగరాజు, నేరుసు దుర్గా సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించారు.

## ఐటీడీఏ పీవో అధికారులతో వరద పై అత్యవసర సమావేశం....





- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజల ప్రాణభద్ర అత్యంత ప్రాధాన్యత శుభం నొక్వల్

**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 24.** చింతూరు డివిజన్‌లో భారీవర్షాలు, వరద ముప్పు నేపథ్యంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నోఖ్వాల్ కూనవరం,విఆర్ పురం మండలాల అధికారులతో అత్య వసర సమీక్ష నిర్వహించారు.గురువారం రెండు మండలాల తహసీల్దార్ కార్యాల యాల్లో జరిగిన సమావేశంలో వర ద ప్రభావిత గ్రామాలు,లోతట్టు ప్రాం తాలు,నదులు,వాగులు,వంతెనలు, రాకపోకలు,తాగునీరు,విద్యుత్,వైద్య సేవలపై సమగ్రంగా చర్చించా రు.వరదలను ఎప్పటికప్పుడు పర్య వేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చే పట్టాలని అధికారులను ఆదేశించా రు.వరద ప్రభావిత ప్రాంతాల్లో గర్భి ణీలు,చిన్నారులు,వృద్ధులు,దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,అవ సరమైతే సురక్షిత ప్రాంతాలకు తర లించే ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు.ప్రతి మండలానికి డిప్యూటీ కలెక్టర్లను,ప్రతి గ్రామ పం చాయతీకి ప్రత్యేక అధికారులను నియమించి 24 గంటల కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితులను నిశి తంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. విఆర్ పురం అన్నవరం వంతెన, కూనవరం శబరి బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన పీవో.ప్రజలు నదులు,వాగుల వద్ద అనవసర ప్రయాణాలు చేయవద్ద ని,అధికారుల సూచనలు తప్పని సరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని కోరా రు.ప్రజల ప్రాణ భద్రతకే అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణారెడ్డి,శ్రీనివాసు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డొంకరాయి జలాశయం నుండి నీరు విడుదల



**వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్,సెప్టెంబర్ 24 :** గుర్తేడు మండలం బొడ్డగండి పంచాయతీ లోయర్ సీలేరు డాం డొంకరాయి జలాశయం నుండి నీటిని క్రిందికి వదులుచున్నట్లు ఏపీ జెన్కో కార్య నిర్వాహక ఇంజనీర్ పత్రిక ప్రకటనలో తెలియజేశారు.
డొంకరాయి జలాశయానికి అధి కంగా నీరు వచ్చి చేరుతుందని ప్రస్తుతం 1027 అడుగులు ఉందని, జలాశయం కెపాసిటీ 1037 అడుగుల అని తెలిపారు. జలాశయం దిగిన ఉన్న గ్రామాల ప్రజలు, జంతు జాలాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని గురువారం జలాశయం నుండి నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

# గంగవరంలో ఘనంగా గణనాథుల నిమజ్జన శోభాయాత్ర





**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**గణపతి నవరాత్రుల సందర్భంగా గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జన శోభాయాత్రలు గురువారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. పాత గంగవరం గ్రామంలోని రామాలయం వద్ద మాజీ కోఆప్షన్ సభ్యులు కొమ్మన చిన్నారావు దంపతులు ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల గణేష్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగిస్తూ జడేరు పెద్దేరు వాగు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అదేవిధంగా గొరగుమ్మి గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహానికి కూడా ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. గంగవరం, అడ్డపల్లి, ఏటపల్లి తదితర గ్రామాల మీదుగా శోభాయాత్ర కొనసాగింది. యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు, కోలాటాలతో సందడి చేశారు. అనంతరం గణనాథుడిని పెద్దేరు వాగు వద్దకు తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గంగవరం ఎస్ఐ వెంకయ్య ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్రలు సజావుగా సాగేందుకు పోలీసు సిబ్బంది పర్యవేక్షణ చేపట్టారు. దీంతో గణనాథుల నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.

## రోడ్డు ప్రమాదం.. ఆర్ఎంపీ వైద్యుడు మృతి

ఏటిపల్లి వంతెన వద్ద అదుపుతప్పి తుప్పల్లో పడిన వాహనం





**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**గంగవరం మండలం ఏటిపల్లి వంతెన వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వంగలమడుగు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు థామస్ (46) మృతి చెందాడు. వంతెన సమీపంలో ప్రమాదానికి గురైన ఆయన సుమారు 30 అడుగుల లోతులో ఉన్న తుప్పల్లో పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు ప్రమాద విషయం తెలుసుకున్న 108 అత్యవసర సేవల సిబ్బంది నవాజ్, చందు, చిన్నబ్బులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తుప్పల్లో హెల్మెట్‌తో పడిపోయిన థామస్‌ను తీవ్రంగా శ్రమించి బయటకు తీశారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు 108 సిబ్బంది నిర్ధారించారు. సమాచారం అందుకున్న గంగవరం ఎస్ఐ వెంకయ్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకయ్య తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనతో వంగలమడుగు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పులి దాడిలో నాలుగు పశువులు మృతి

బాధిత రైతును పరామర్శించిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి



**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**గంగవరం మండలం మర్రిపాలెం గ్రామంలో పులి దాడిలో రైతుకు చెందిన నాలుగు పశువులు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు రాజారెడ్డి తన పొలంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పులి పొలంలోకి ప్రవేశించి ఆయనకు చెందిన నాలుగు పశువులపై దాడి చేయడంతో అవి మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి గురువారం మర్రిపాలెం గ్రామానికి వెళ్లి బాధిత రైతు రాజారెడ్డిని పరామర్శించారు. పులి దాడిలో పశువులను కోల్పోయిన కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా స్వప్న కుమారి సబ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, పులి దాడిలో పశువులను కోల్పోయిన రైతుకు నిబంధనల మేరకు న్యాయం చేసి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సబ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ బాధిత రైతుకు నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అధికారుల పర్యవేక్షణలో పులి దాడిలో మృతి చెందిన పశువుల దహన సంస్కారాలను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్న కుమారి మాట్లాడుతూ పులి సంచారం నేపథ్యంలో మర్రిపాలెం పరిసర ప్రాంతాల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గంగవరం టీడీపీ మండల అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, అటవీశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజమహేంద్రవరంలో అక్టోబర్ 8, 9 తేదీల్లో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు



- విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యం
- కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 24:**ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలకు రాజమహేంద్రవరం మరోమారు వేదిక కానుంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఆధ్వర్యంలో అక్టోబర్ 8, 9 తేదీల్లో రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను నిర్వహించనున్నారు.

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, ఏపీ ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా, నగర శాఖల సంయుక్త సహకారంతో ఇస్రో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త, ఇస్రో సివిల్ విభాగం అధిపతి వి.లక్ష్మణ సతీష్, సీనియర్ శాస్త్రవేత్త కె.అశ్విని బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖ, నగర పాలక సంస్థ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేసి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ ప్రదర్శనలను సందర్శించి అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని ఆమె కోరారు. అంతకు ముందు నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ రాహుల్ మీనా కార్యక్రమ ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. ఇస్రో చేపట్టిన వివిధ అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించిన రాకెట్ నమూనాలు, అంతరిక్ష విజ్ఞాన ప్రదర్శనలు ఈ వారోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని నిర్వాహకులు కలెక్టర్ కు వివరించడం జరిగింది. ఇస్రో శాస్త్రవేత్తలు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయనున్నట్లు తెలిపారు.

ఆరవ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థుల కోసం ప్రశ్నావళి పోటీ, చిత్రలేఖన పోటీ, అక్కడికక్కడే ప్రశ్నల పోటీ, అక్కడికక్కడే ఛాయాచిత్రాల పోటీలు నిర్వహించనున్నారు.

ANDHRA PRADESH PRIVATE UN-AIDED SCHOOLS' MANAGEMENTS' ASSOCIATION
APPUSMA
IGNITING THE MINDS TOWARDS VISION AND EXCELLENCE
COMMIT YOURSELF TO QUALITY
RAJAMAHENDRAVARAM

## భారీ వర్షాలపై ముందస్తు సన్నద్ధతతో పనిచేయాలి

- కట్‌ఆఫ్, లోతట్టు ప్రాంతాలపై నిరంతర నిఘా
- కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**పోలవరం జిల్లాలో భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు సన్నద్ధతతో పనిచేయాలని కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, చింతూరు పీవో/సబ్ కలెక్టర్ శుభం నొక్వల్, ఆర్డీవో కె. స్వాతి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలు, వరదలు, పునరావాసం, సహాయక చర్యలపై సమీక్షించారు. గత 24 గంటల్లో జిల్లాలో సగటున 109 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గోదావరిలోకి 12--14 లక్షల క్యూసెక్కులు, శబరిలోకి సుమారు 4 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున నదీ ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 26 నుంచి 28 మధ్య వరద తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున చివరి నిమిషంలో ఏర్పాట్లు చేయకుండా ముందుగానే చర్యలు పూర్తి చేయాలని ఆదేశించారు.

కట్‌ఆఫ్ ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రాంతాల్లో పోలీస్, రెవెన్యూ సిబ్బందితో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, ప్రజలు ప్రమాదకర ప్రాంతాలు, వరద ప్రవాహాలను దాటకుండా కట్టడి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను తరలించేందుకు పునరావాస కేంద్రాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రంపచోడవరం పరిధిలో 15 ప్రాంతాల్లో 17 పునరావాస కేంద్రాలను గుర్తించి 22 గ్రామాలను కవర్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీఆర్.పురం, కూనవరం మండలాల్లో పడవలు, సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధుల వివరాలను ముందుగానే సేకరించి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య బృందాలు, మందులు, పారిశుధ్య సామగ్రిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను గంటకోసారి లేదా అవసరాన్ని బట్టి అరగంటకోసారి కంట్రోల్ రూమ్‌లకు ఫొటోలతో సహా అందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణ భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## కూచిపూడి సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శించిన సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**అన్నదేవరపేట గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు కూచిపూడి గణపతి తండ్రి కూచిపూడి సుబ్రహ్మణ్యం అకాల మరణం పట్ల కొవ్వూరు మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, టీడీపీ నాయకులు సూర్యదేవర రంజిత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం కూచిపూడి గణపతి కుటుంబ సభ్యులను వారు పరామర్శించి, సుబ్రహ్మణ్యం మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ క్లిష్ట సమయంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సుబ్రహ్మణ్యం మృతి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని వారు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూచిపూడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్‌గా గంగాధర్ బాధ్యతల స్వీకరణ



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**జిల్లాల విభజనలో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన చింతపల్లి గంగాధర్ పోలవరం జిల్లా రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ విద్య విభాగంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ 23న గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగదయ్య సమక్షంలో ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ సిబ్బంది, ఎన్‌జీవో నాయకులు రేగం వెంకటేశ్వరరావు, వాసు, చక్రధరరావు, పీఎంఆర్‌సీ ఏటీవో బి. చిన్ని బాబు, బొండ్ల ప్రసాద్, శిరీష తదితరులు గంగాధర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ సిబ్బంది కూడా ఆయనకు అభినందనలు తెలియజేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కాల్వలు దాటొద్దు.. అప్రమత్తంగా ఉండండి





- వర్షాలు తగ్గే వరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలి
- రాకపోకలకు అంతరాయం కలిగిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు
- జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్

**గంగవరం/ మారేడుమిల్లి/రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పోలవరం జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు తగ్గే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్వలు, వాగులు దాటవద్దని జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ సూచించారు. అత్యవసర సహాయక చర్యల కోసం అధికారులు, సిబ్బందిని 24 గంటలూ అప్రమత్తంగా ఉంచినట్లు తెలిపారు.గురువారం మారేడుమిల్లి నుంచి గుర్తేడు వెళ్లే రహదారిలో వర్షాల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రహదారి క్లియరెన్స్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు.

**కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన**

మారేడుమిల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా ఏ గ్రామంలోనైనా నష్టం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
అనంతరం బోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఆయన వైద్యులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది, మందుల లభ్యత, ప్రతిరోజూ వచ్చే రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల వివరాలను కూడా పరిశీలించారు.

**అంగన్‌వాడీ చిన్నారులకు ఆహారం పంపిణీ**

తుఫాను పరిస్థితుల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినందున మారేడుమిల్లి అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ఆ రోజు అందించాల్సిన ఆహార పదార్థాలను వారి ఇళ్లకు వెళ్లి అందించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

**సీతపల్లి కాల్వ వద్ద పరిశీలన**

రంపచోడవరం మండలంలో రంపచోడవరం--రంప మార్గంలోని సీతపల్లి కాల్వ ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాన్ని కూడా జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. కాల్వ ఉధృతి తగ్గే వరకు రంప మీదుగా వెళ్లే గ్రామాల ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్వ దాటవద్దని హెచ్చరించారు. భారీ వర్షాలు తగ్గే వరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు.తుఫాను, భారీ వర్షాలకు సంబంధించిన అత్యవసర సేవల కోసం రంపచోడవరం పరిధిలో 18004252531, 08864243561, 6300772025, చింతూరు ఐటీడీఏ పరిధిలో 9490026387, 8121729228 నంబర్లను సంప్రదించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.జాయింట్ కలెక్టర్ వెంట తహసీల్దార్లు సీహెచ్. బాలాజీ, అమ్మాజీ, ఎంపీడీవోలు ప్రసాద్, శ్రీనివాసరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్. నిర్మల, ఏసుబాబు, వీఆర్వో చిన్నరాజు తదితరులు ఉన్నారు.

## ఎండిపోయిన చెరువులకు జీవం...

-మిర్చిరైతుకు నష్టం



**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్24.** బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా చింతూరు డివిజన్‌లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తు న్నాయి.ఎల్-నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు లేక చెరువులు,కుం టలు పూర్తిగా ఎండిపోయాయి.వరి సాగు కూడా అతి తక్కువగా సాగిం ది.ఇప్పుడు కురిసిన వర్షాలకు చెరు వులు,వాగులు పొంగి పొర్లుతుండ డంతో రైతులు కాస్త ఊరట పడు తున్నారు.కానీ ఇప్పుడే పంట దశ లోకి వస్తున్న మిర్చి పంట రైతుల్లో మాత్రం తీవ్ర ఆందోళన నెలకొంది. మిర్చి యాతవేసిన రైతులు వరుస వర్షాలతో పొలాల్లో నీరు నిలిచి, పంట వేరుకు నష్టం జరిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మిర్చి పంట ఇలా మునిగితే ఇప్పటివరకు పడ్డ కష్టం, పెట్టుబడి వృథా అవుతుందనిమిర్చి రైతులు ఆవేదన చెందుతున్నారు.
వర్షాల కారణంగా గ్రామీణ రోడ్లు జలమయం కావడంతో ప్రజలు ఇళ్ల కే పరిమితమయ్యారు.మరో 48గం టలు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చ రించడంతో అధికారులు లోతట్టు ప్రాంతాలను నిశితంగా పర్యవేక్షిస్తు న్నారు.

## భారీ వర్షాలపై తహశీల్దార్ అప్రమత్తత

- గోదావరి ఉధృతం - కొవ్వాడ కాలువ వద్ద రాకపోకలు నిలిపివేత -- కంట్రోల్ రూమ్ ఏర్పాటు





**తాళ్లపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** భారీ వర్షాల నేపథ్యంలో తాళ్లపూడి మండల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎన్.లక్ష్మీ లావణ్య సూచించారు. గురువారం, శుక్రవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు నది పరివాహక ప్రాంతాలు, నది సమీప ప్రాంతాల్లోకి వెళ్లవద్దని తహశీల్దార్ హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాలు, వరదలు, రహదారుల పరిస్థితి లేదా ఇతర అత్యవసర సమాచారాన్ని తెలియజేయాలనుకునే ప్రజలు 7993636666 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం మండలంలోని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. సెలవు రోజున ఎక్కడా పాఠశాలల నిర్వహణ లేదా స్కూల్ వర్క్ జరగకూడదని స్పష్టం చేశారు. ఈ మేరకు పలు పాఠశాలలను తహశీల్దార్ స్వయంగా తనిఖీ చేశారు. ఇదిలా ఉండగా అన్నదేవరపేట, రాగోలపల్లి ప్రాంతాల సమీపంలో కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆ మార్గంలో రాకపోకలు సాగించవద్దని అధికారులు సూచించారు. ప్రమాదం జరగకుండా ఆయా ప్రాంతాల్లో రహదారులను తహశీల్దార్ దగ్గరుండి మూసివేయించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారులు తమ తమ గ్రామాల్లోనే ఉండి వర్షాలు, వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని తహశీల్దార్ ఎన్.లక్ష్మీ లావణ్య కోరారు.

## ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ ఇతర సభ్యులకు ఘన సత్కారం



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 24:-** తమ పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, మండలంలోని ఇతర ఎంపీటీసీ సభ్యులకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు తమ సిబ్బంది ఘనంగా పౌర సన్మానం చేసి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు పనితీరుపై ప్రశంసలు కురిపించారు. మండల అభివృద్ధికి చేసిన కృషిని అభినందించారు. అలాగే ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు మాట్లాడుతూ పదవీ కాలంలో తనకు సహకరించిన అధికారులు, తోటి ప్రజాప్రతినిధులకు కృతజజతలు తెలిపారు. అధికారులు, పాలకవర్గ సభ్యులు, ప్రజల సహకారంతో మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామన్నారు. ఐదేళ్ల పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, ఎంపీటీసీలు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గోకవరం ఎంపీపీ కార్యాలయంలోసంబంధం లేని వ్యక్తికి ప్రజాధనంతో పౌర సన్మానమా...???

మహిళా ప్రజాప్రతినిధికి బదులు భర్తకు పౌర సన్మానం పై రేగుతున్న దుమారం.





**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 24 :-** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహిళా ప్రజాప్రతినిధులకు బదులు భర్తలు పెత్తనం చేయకూడదని సమావేశాల్లో పాల్గొనకూడదని కఠినమైన ఖచ్చితమైన తీర్పులు జీవోలు ఉన్నాయి కానీ గోకవరం మండల పరిషత్ అధికారులు మాత్రం సుప్రీంకోర్టు ఆదేశాల కన్నా అగ్రవర్ణ నాయకులు మెప్పులు మాత్రమే కావాలన్నట్లు వ్యవహరిస్తున్నారు దీనికి ఉదాహరణ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పౌర సన్మానాలు దీనిపై పలు విమర్శలు పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తుంది. గురువారం గోకవరం మండల పరిషత్ లో జరిగిన పౌరసన్మానం మహిళా సాధికారత ను అపహాస్యం చేసేలా జరిగింది. రంప ఎర్రంపాలెం ఎంపీటీసీ బదులు ఆమె భర్తను ప్రజాధనంతో పౌర సన్మానం పొందడం తీవ్ర దుమారం రేపుతోంది.ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న నిజమైన సేవకులను గుర్తించని అధికారులు, ఏ పదవీ లేని, ప్రజలచే ఎన్నుకోబడని ఒక ప్రైవేట్ వ్యక్తికి, అదీ మహిళా ప్రతినిధి భర్త ఒకే ఒక అర్హత అడ్డుపెట్టుకుని వాళ్లకు కావాల్సిన సంబంధం లేని వ్యక్తిని సన్మానం చేయడం పట్ల పూర్తిగా ప్రోటోకాల్ ఉల్లంగించారాని పలువురు మండిపడుతున్నాయి.

**జీవోల ప్రకారం ఇది క్షమించరాని నేరం:**

జీవో నెం .135 ప్రకారం ఇది ప్రోటోకాల్ ఉల్లంఘనే అవుతుందని పౌర సన్మానం పొందాల్సింది ఎన్నుకో బడిన ఎంపీటీసీ గైర్హాజరైతే సన్మానాన్ని వాయిదా వేయాలి లేదా ఆమె ఇంటికి వెళ్లి ఇవ్వాలి అని అంతేగాని అదే స్థానాన్ని వేరే సంబంధం లేని ( భర్త అయినా సరే )వ్యక్తులకు ఇవ్వకూడదని స్పష్టంగా చెబుతుంది. ఇది స్పష్టమైన ప్రోటోకాల్ ఉల్లంఘన గానే చర్యలు తీసుకోవాలి.

**73వ రాజ్యాంగ సవరణ ఉల్లంఘన**

భార్యను ఇంట్లో ఉంచి భర్త పరిపాలన చేయడం, సన్మానాలు పొందడం సంస్కృతి అనేది మహిళా రిజర్వేషన్ లక్ష్యాన్ని దెబ్బతీయడమేనని సర్వోన్నత న్యాయస్థానం ఎన్నో సందర్భాల్లో తప్పు పట్టిందని మరి అధికారులకు ఇది ఎందుకు కనిపించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ప్రకారం ప్రజాధనం దుర్వినియోగం**

ఎంపీటీసీ ఊళ్ళో ఉండగా ఆమె భర్తకు శాలువా, మెమెంటో ఇచ్చి ప్రభుత్వ నిధులు వృధా చేయడం ప్రజాధనం దుర్వినియోగం కిందకు వస్తుందని జీవో నెంబర్ 29 ప్రకారం ప్రజాధనం దుర్వినియోగమేనని దీనిపైన కూడా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**వీళ్లకు ఒక రూలు తనకు ఒకరులా**

ఇదే పౌర సన్మానాలు కార్యక్రమంలో తమ తమ భార్యలను తీసుకువచ్చి గౌరవంగా భార్యాభర్త పౌర సన్మానం పొందారు ఈత అందరూ ఎంతో సంతోషించదగ్గ విషయం అభినందించదగ్గ విశేషాలు మరి ఆ ఎంపీటీసీ నియంతృత్వం ఏంటి ప్రభుత్వ జీవోలను కూడా ఉల్లంఘించి తాను అనుకుంటే ఆ అధికారులు ఎందుకు చేయాలి మరి ఇదే విధానం ప్రజల విషయంలో ఆ అధికారులకు ఉండాలి కదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు

**అభివృద్ధి విషయంలో మాత్రం నిర్లక్ష్యం**

ఇదే ఎంపీటీసీ పరిధిలో మండల పరిషత్ నిధులు రూ.1.70 లక్షలతో ఎస్సీ స్మశాన వాటికకు రెండేళ్ల క్రితం మౌలిక వసతులు కల్పించడానికి భూమి పూజ చేసి నేటికీ పనులు చేయలేదని, ఎస్సీ పేటలో సచివాలయం పక్కన మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తున్నా పట్టించుకోలేదని భర్తల సన్మానాలను ప్రజలు నిలదీస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణం కల్పించుకుని ఇలాంటి సంస్కృతి మరెక్కడ ఎప్పుడు జరగకుండా అదేవిధంగా దర్యాప్తు జరిపి ఆ సన్మానానికి పెట్టిన ఖర్చును వారి నుండే రికవరీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి ఛాంపియన్‌గా సత్తాచాటిన రంప ఎర్రంపాలెం కుర్రాడు పెనుగొండ ముఖేష్.






**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 24** రాష్ట్రస్థాయి అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన పెనుగొండ ముఖేష్ అలియాస్ మున్నా సత్తా చాటాడు.ముఖేష్ కాకినాడ కోరంగి కైట్ కళాశాల తరపున పాల్గొని జట్టు సత్తాచాటి రాష్ట్రస్థాయి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ నెల 12, 13 తేదీలలో కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం,ఉప్పాడ మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో పురుషులు, మహిళల విభాగాల్లో కైట్ కళాశాల జట్లు గోల్డ్ మెడల్స్ సాధించి ప్రథమ స్థానం లో నిలిచాయి.ఈ విజయాల్లో గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన పెనుగొండ ముఖేష్ (మున్నా) కీలక పాత్ర పోషించారు.ఎర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు పదవ తరగతి ఉత్తీర్ణుడై,ప్రస్తుతం కైట్ కళాశాల లో విద్యను అభ్యసిస్తున్న ముఖేష్ కు చిన్నప్పటి నుండి క్రీడలపై ఎంతో మక్కువ. పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరచి జట్టు విజయానికి తనవంతు సహకారం అందించారు. ముఖేష్ ప్రతిభను కైట్ కళాశాల యాజమాన్యం, పీడీ మల్లిక, శిక్షణ కర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు. కైట్ కళాశాల పీడీ మల్లిక మాట్లాడుతూ జట్టు సమన్వయం, అంకితభావం, క్రమశిక్షణతో పాటు నిరంతర కృషి వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని తెలిపారు. పురుషులు, మహిళల రెండు జట్లు రాష్ట్రస్థాయి ఛాంపియన్‌గా నిలవడం పట్ల కైట్ కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.సొంత గ్రామమైన రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన పెనుగొండ ముఖేష్ (మున్నా) ను జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు, పలువురు సామాజిక వేత్తలు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

# టీడీపీతో ఢీ..తప్పదా

**విజయవాడ, సెప్టెంబర్ 24, పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎంతో పట్టుదలతో ఉన్నారు. కాకినాడలో నిర్వహించిన జనసేన రాష్ట్రస్థాయి ఎన్నికల సన్నాహక సమావేశంలో పవన్‌కల్యాణ్ కీలక కామెంట్స్ చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే పార్టీ ఎక్కడెక్కడ బలంగా వుందో గుర్తించేందుకు కమిటీలను వేసిన సంగతి తెలిసిందే. ఆ కమిటీలు ప్రస్తుతం ఆ పనిపై బిజీగా వున్నాయి.ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో పవన్ దిశానిర్దేశంపై కీలక అంశాలు బయటికి వస్తున్నాయి. టీడీపీ అనుకూల మీడియా పవన్ కామెంట్స్‌ను తమ పార్టీకి అనుకూలంగా రాసుకొచ్చాయి. ఆత్మాభిమానం తగ్గని రీతిలో జనసేన పోటీ చేస్తుందని పవన్‌కల్యాణ్ అన్నారు. అవసరమైతే మిత్ర ధర్మం పాటిస్తూనే, పార్టీ బలంగా వుందని కార్యకర్తలు నమ్మిన చోట పోటీకి దిగుతామనే పవన్ అభిప్రాయాన్ని అర్థం చేసుకునే వాళ్లకు కావాల్సిన అర్థం వుంది.జనసేన సోషల్ మీడియాలో ప్రధానంగా కాకినాడలో పవన్ దిశానిర్దేశంపై విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. స్థానిక సంస్థల్లో బలం ఉన్న చోటే పోటీ అనే ప్రచారంపై పవన్ చాలా స్పష్టంగా తేల్చి చెప్పారనేది ఆ ప్రచార సారాంశం. పొత్తులో ఉన్నామనే కారణంతో, టీడీపీ చెబుతున్న ప్రకారం 15 శాతం సీట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రశ్నే లేదని పవన్ తేల్చి చెప్పారని అంటున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల విషయంలో టీడీపీ ప్రతిపాదనలపై అంగీకారం లేకపోతే, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రశ్నే లేదని పవన్ తేల్చి చెప్పినట్టు జనసేన సోషల్ మీడియా ప్రచారం చేస్తోంది. జనసేన బలంగా ఉన్న చోట టీడీపీ టికెట్లు కోరితే, ఇచ్చేందుకు సిద్ధంగా లేమని పవన్ స్పష్టం చేశారు. టీడీపీ వెనక్కి తగ్గకపోతే, ఆ పార్టీతో పోటీకి సిద్ధంగా వుండాలని తన పార్టీ





నాయకులకు దిశానిర్దేశం చేసినట్టు జనసేన సోషల్ మీడియా ప్రచారం చేస్తోంది. ఈ ఎన్నికలు ముమ్మాటికీ జనసేన బలోపేతానికే అని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారని సమాచారం.పవన్‌కల్యాణ్ చెప్పిన దాని ప్రకారం... చాలా చోట్ల టీడీపీతో ఫ్రెండ్లీ పోటీ తప్పేలా లేదు. ఎందుకంటే, జనసేన నాయకత్వాన్ని బలపరిచేందుకు టీడీపీ సిద్ధంగా లేదు. స్థానిక సంస్థల్లో జనసేన బలపడితే, సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక సీట్లు డిమాండ్ చేస్తుందనే భయం టీడీపీని వెంటాడుతోంది. అందుకే క్షేత్రస్థాయిలో జనసేన బలం నామమాత్రం అని చూపడానికైనా, స్థానిక సంస్థల ఎన్నికల్లో తక్కువ సీట్లు ఇవ్వడానికే టీడీపీ ప్రాధాన్యం ఇస్తుంది. అయితే తగ్గేదే లే అనే మాటపై పవన్ నిలబడతారా? అనేదే ఇప్పుడు ప్రశ్న.

# సైలెంట్ రిటైర్మెంట్‌కు రంగం సిద్ధం

**విజయవాడ, సెప్టెంబర్ 24 పెన్ పవర్:** తాడేపల్లి ప్యాలెస్‌లో అసలేం జరుగుతోంది? ఐదేళ్లపాటు సర్కారుకు, పార్టీకి సర్వం తానై నడిపించిన ఆ సర్వజ్ఞుడు ఇప్పుడు సైలెంట్ రిటైర్మెంట్‌కు రంగం సిద్ధం చేసుకుంటున్నారా?. గత కొద్ది రోజులుగా తాడేపల్లి ప్యాలెస్‌లో చక్కర్లు కొడుతున్న ఓ గాసిప్ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ అంతర్గత వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు రేపుతోంది. ఒకప్పుడు జగన్ నోటి నుంచి వచ్చే మాటకు ముందే ప్రెస్ మీట్లలో సమాధానాలు పేర్చిన ఆ అగ్రనేత.. ఇప్పుడు అధినేతతో విభేదించి తన సొంత దారి తాను చూసుకుంటున్నారనే గుసగుసలు వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి ఏడేళ్లుగా నాన్‌స్టాప్ బాటింగ్ చేసి, విపక్షాల విమర్శలన్నీ తన నెత్తినే వేసుకున్న ఆ కీలక సలహాదారునికి ఇప్పుడు సొంత పార్టీలోనే దిక్కుతోచని పరిస్థితి వచ్చిపడిందన్నది మొదటి పాయింట్. ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పార్టీ కేడర్ సైతం ఆయన్నే ప్రధాన ముద్దాయిగా చూస్తోంది. జగన్‌ను ప్రజలు మాత్రమే టార్గెట్ చేస్తే.. పార్టీలోని సొంత సోషల్ మీడియా సైన్యం కూడా సదరు నేత నిర్ణయాల వల్లే కొంప మునిగిందంటూ అంతర్గతంగా కారాలు మిరియాలు నూరుతోంది. ఇటు బాస్ వద్ద క్రెడిబిలిటీ పోయి, అటు కార్యకర్తల వద్ద పరువు పోయి.. ఇప్పుడు ఆయన పార్టీలో పూర్తి ఒంటరిగా మారారనే ప్రచారం జోరందుకుంది.తాజాగా మీడియా ముందుకు వచ్చిన సందర్భాల్లో అధినేత పక్కన కూర్చుని ఆయన పడ్డ పాట్లు చూసిన వారెవరికైనా వ్యవహారం తేడా కొడుతోందనే విషయం ఇట్టే అర్థమవుతోంది. లైవ్ కెమెరాల సాక్షిగా జగన్ అడ్డగోలు స్టేట్‌మెంట్లు ఇస్తుంటే.. దాన్ని సరిదిద్దలేక, ఆ తప్పిదాన్ని వెనకేసుకురాలేక సదరు మేధావి ముఖంలో కనిపించిన ఆందోళన అంతా ఇంతా కాదు. అధినేత మాటలకు, తన డిఫెన్స్‌కు ఇక ఏమాత్రం పొంతన కుదరడం లేదని ఆయన స్వయంగా ఒక నిర్ధారణకు వచ్చేశారని అంటున్నారు.ఇదే సమయంలో అత్యంత ఆసక్తికరమైన ఆర్థిక వ్యూహం తెరపైకి వచ్చింది. పార్టీ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడంతో.. తన వ్యాపారాలు, భారీ పెట్టుబడులను గుట్టుచప్పుడు కాకుండా విదేశీ షెల్ కంపెనీలకు మళ్లించేలా భారీ లావాదేవీల నెట్‌వర్క్ నడుస్తోందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రేపటి రోజున వైఎస్ కుటుంబ వారసత్వాన్ని, రాజకీయ పగ్గాలను ఆయనే లాగేసుకుని కొత్త రూపుతో తెరపైకి వచ్చినా ఆశ్చర్యం లేదంటూ చెవులు కొరుక్కుంటున్నారు. ఐదేళ్లు అధికారాన్ని చక్రం తిప్పిన ఈ కీలక నాయకుడు నిజంగానే జగన్‌కు హ్యాండ్ ఇచ్చి సైడ్ అయిపోతున్నారా.. లేక ఇది ప్రత్యర్థులు ఆడుతున్న పక్కా మైండ్ గేమా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. ఏది ఏమైనా, తాడేపల్లి కోటలో మాత్రం అగ్గి రాజుకుందన్నది బహిరంగ రహస్యం!

**వేటు తప్పదా**

తన పార్టీ నాయకులు, కార్యకర్తల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భరోసా నింపే ప్రయత్నం చేశారు. కార్యకర్తల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే, ఊరుకునే ప్రశ్నే లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.మరీ ముఖ్యంగా పోలీసులను అడ్డం పెట్టుకుని, అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తే, వాళ్ల పని పడతామని జగన్ తనదైన స్టైల్‌లో వార్నింగ్ ఇవ్వడం గమనార్హం.స్థానిక సంస్థల ఎన్నికల్లో యుద్ధం చేయాలని తన పార్టీ కార్యకర్తలు, నాయకులకు వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. గ్రేటర్ విశాఖ నేతలతో నిర్వహించిన కీలక సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడారు. చేసిన పాపాలు ఎక్కడికీ పోవన్నారు. ప్రతిదీ అనుభవించాల్సి వస్తుందని కూటమి నేతల్ని హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో యుద్ధం చేయాలని, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మొదలుకుని , తన వరకూ సంపూర్ణ మద్దతు వుంటుందని జగన్ భరోసా ఇచ్చారు. ఏ పోలీసైనా అన్యాయంగా వ్యవహరిస్తే , గుర్తించుకోవాలని జగన్ కోరారు. ఇదొక్కటే చెబుతున్నానని ఆయన అన్నారు.అందరికీ ముందే చెప్పాలని జగన్ కోరారు. వేగంగా టైమ్ చక్రం తిరుగుతోందని, కళ్లు మూసి, తెరిచే లోపు రెండున్నరేళ్లు దాటిపోయాయని ఆయన అన్నారు.రెండేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆ తర్వాత ఐదేళ్లు తమను చూస్తారని ఇబ్బంది పెట్టేవాళ్లకు చెప్పాలని జగన్ పదేపదే కోరారు. ఏ పోలీసైతే అన్యాయం చేస్తాడో, వాళ్లందరినీ డిజిటల్ డైరీలో ఎక్కించాలన్నారు.అధికారంలోకి వచ్చాక డిజిటల్ డైరీని ఓపెన్ చేస్తామని జగన్ అన్నారు. అప్పుడు అన్యాయం చేసిన వాళ్ల లెక్కలు తీస్తామన్నారు. చట్టం అనేది ఎలా పని చేస్తుందో అలాంటి వాళ్లందరికీ సినిమా చూపుతామని జగన్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# వైసీపీలో ఉత్కంఠ...

**విజయనగరం, సెప్టెంబర్ 24, పెన్ పవర్:** విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అభ్యర్థి ఎవరనే అంశంపై వైసీపీ లో ఉత్కంఠ కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ పదవికి సంబంధించి పార్టీ అధిష్ఠానం తీసుకోబోయే నిర్ణయం ఇప్పుడు జిల్లాలో రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. కొంతకాలం క్రితం సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన కుమార్తె బొత్స అనూషను జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. అయితే ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలతో ఆ నిర్ణయంపై మళ్లీ సందేహాలు వ్యక్తమవుతున్నాయి.విజయనగరం జిల్లా రాజకీయాల్లో కీలకంగా ఉన్న మాజీ జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరడం రాజకీయ సమీకరణాలను మార్చింది. జడ్పీ పదవికి సంబంధించి కుటుంబంలోనే భిన్నాభిప్రాయాలు ఏర్పడినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. శ్రీనివాసరావు తన కుమార్తె సిరి సహస్రను జడ్పీ చైర్‌పర్సన్‌గా చూడాలనుకున్నారని, అదే సమయంలో బొత్స అనూష పేరును తెరపైకి తీసుకురావడంతో విభేదాలు ఏర్పడ్డాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగింది. అయితే రాజీనామాకు ఇతర కారణాలను కూడా శ్రీనివాసరావు ప్రస్తావించిన విషయం తెలిసిందే.ఈ పరిణామాల అనంతరం బొత్స అనూషకు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవైపు ఆమెకు కొత్త పార్టీ బాధ్యతలు రావడం, మరోవైపు విజయనగరం జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిత్వంపై స్పష్టత లేకపోవడంతో వైసీపీలో కొత్త చర్చ మొదలైంది. అనూష స్థానంలో మరొకరిని జడ్పీ అభ్యర్థిగా ఎంపిక చేస్తారా? లేక



ఆమె పేరుతోనే పార్టీ ముందుకు వెళ్తుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.విజయనగరం జిల్లా పరిషత్ రాజకీయాల్లో బొత్స కుటుంబానికి చాలాకాలంగా ప్రాధాన్యం ఉన్న విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా ఉంది. 2001లో బొత్స సతీమణి ఝాన్సీలక్ష్మి జడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ కుటుంబానికి సన్నిహితంగా ఉన్న పలువురు నేతలు కూడా ఈ పదవిలో కొనసాగారు. బడుకొండ అప్పలనాయుడు, బెల్లాన చంద్రశేఖర్ వంటి నేతలు వేర్వేరు దశల్లో జడ్పీకి నాయకత్వం వహించారు. దీంతో జడ్పీ పీఠం విషయంలో బొత్స కుటుంబ ప్రభావం చాలాకాలంగా ఉందనే అభిప్రాయం జిల్లాలో ఉంది.ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ ముందు రెండు ప్రధాన అంశాలు కనిపిస్తున్నాయి. అనూషకు భీమిలి బాధ్యతలు కొనసాగిస్తూ విజయనగరం జడ్పీకి కొత్త అభ్యర్థిని ఎంపిక చేయడం ఒక మార్గం కాగా, కుటుంబానికి చెందిన మరో వ్యక్తిని ఈ పదవికి ప్రతిపాదించడం మరో అవకాశం. అదే సమయంలో పార్టీలోని సీనియర్ నాయకుల్లో ఎవరికైనా అవకాశం కల్పించే అంశం కూడా పరిశీలనలో ఉండవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన రాజకీయ కసరత్తు వేగం పుంజుకుంటున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలాబలాలు కీలకంగా మారనున్నాయి. దీంతో విజయనగరం జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిపై వైసీపీ అధిష్ఠానం తీసుకునే తుది నిర్ణయంపైనే ప్రస్తుతం అందరి దృష్టి నెలకొంది. అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ అంశంపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడే అవకాశం కనిపించడం లేదు.

## గోదావరి పుష్కరాల్లో అవకతవకలు

**రాజమండ్రి సెప్టెంబర్ 24, పెన్ పవర్:** గత 2015 లో జరిగిన ప్రతిష్టాత్మక గోదావరి పుష్కరాల పనుల నిర్వహణలో చోటుచేసుకున్న తీవ్ర అక్రమాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఆ సమయంలో జరిగిన ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. ఈ విచారణకు సంబంధించిన నివేదికను ఇటీవలే విజిలెన్స్ కమిటీ ప్రభుత్వానికి సమర్పించింది. ఆ నివేదికలోని కీలక అంశాలు, సాక్ష్యాల ఆధారంగా అక్రమాలకు బాధ్యులైన ఇద్దరు ఉన్నత స్థాయి రిటైర్డ్ ఇంజినీరింగ్ అధికారులపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది.ఈ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నాటి పుష్కరాల పనుల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించి, రాజమహేంద్రవరంలో ఎస్‌ఈ గా పని చేసి పదవీ విరమణ పొందిన పాండురంగారావుపై చర్యలు తీసుకోనున్నారు. ఆయనతో పాటు అదే విభాగంలో డీఈఈ గా బాధ్యతలు నిర్వహించి రిటైర్ అయిన ఎం.సి.ఎస్. పాత్రుడుపై కూడా శాఖాపరమైన మరియు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. పుష్కరాల ఘాట్ల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన నిధుల్లో పెద్ద ఎత్తున నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు విజిలెన్స్ కమిటీ నివేదికలో నిర్ధారించారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాబోయే 2027 గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం ముందస్తు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగానే పనుల పారదర్శకత కోసం ఏపీ ప్రభుత్వం ఏటా కోట్ల రూపాయలను కేటాయిస్తూ, ఇలాంటి ముందస్తు విచారణల ద్వారా అవినీతి అధికారులకు గట్టి సంకేతాలు పంపుతోంది. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఉండేందుకు, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఈ కఠినమైన చర్యలకు పూనుకుంది. పదవీ విరమణ చేసినా సరే అవినీతికి పాల్పడితే చట్టం నుండి తప్పించుకోలేరని ఈ ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వం తేల్చి చెప్పింది.

# సోషల్ మీడియా యాక్టివిస్ట్ కు సర్కార్ గుడ్ న్యూస్

**విశాఖపట్టణం సెప్టెంబర్ 24, పెన్ పవర్:** సోషల్ మీడియాను చాలామంది ఒక టైం పాస్ వ్యవహారం లాగా భావిస్తుంటారు. అయితే ఇప్పుడు ఆ భావన పూర్తిగా మార్చుకోవాలి. ఎందుకంటే సోషల్ మీడియా అనేది టైంపాస్ కోసం చేసే వ్యవహారం కాదు. ఎందుకంటే ఒక సమాచారం క్షణాలలో లక్షల మందికి చేరాలంటే.. ప్రజలలోకి తీసుకెళ్లాలంటే సోషల్ మీడియా ఇప్పుడు ప్రధానమైన వేదిక. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియా ప్రాధాన్యాన్ని గుర్తించి సంచలన ప్రకటన చేసింది.ఏపీ లో ప్రభుత్వ పథకాలు.. సంక్షేమ కార్యక్రమాలు.. వంటి వాటిని సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ఇన్ ఫ్లూయెన్సర్ ల సేవలను ప్రభుత్వం ఉపయోగించుకోబోతోంది. ఇందులో భాగంగా సోషల్ మీడియాలో ఇన్ ఫ్లూయెన్సర్ల ఎం ప్యానెల్మెంట్ పాలసీకి ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అంటే ఇకపై సోషల్ మీడియాలో ప్రభుత్వ కార్యక్రమాల పై కంటెంట్ రూపొందించే వారికి అధికారికంగా గుర్తింపు ఇస్తుంది. వారికి లభించే రీచ్ ఆధారంగా నగదు ప్రోత్సాహకాలు కూడా ఇస్తుంది.. ఈ పాలసీ సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లను వారి ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వివిధ కేటగిరీలుగా ప్రభుత్వం విభజించబోతోంది.పదివేల నుంచి 24,999 మంది ఫాలోవర్లో ఉన్న వారికి 2500 వరకు పారితోషికం ఇస్తుంది.25వేల నుంచి 49 ,999 మంది ఫాలోవర్లు ఉన్నవారికి 5000 వరకు పారితోషికం ఇస్తుంది.50 వేల నుంచి 99,999 ఫాలోవర్లు ఉన్నవారికి 7,500 వరకు పారితోషికం ఇస్తుంది.లక్షకు పైగా ఫాలోవర్లు ఉన్నవారికి గరిష్టంగా 15000 వరకు నగదు ప్రోత్సాహకం అందించే విధానం ప్రతిపాదించినట్టు తెలుస్తోంది..అయితే ఈ డబ్బు మొత్తం అందరికీ ఆటోమేటిక్ గా చెల్లించరు.ప్రభుత్వం నిర్దేశించే అర్హతలు.. ఎం ప్యానెల్మెంట్ నిబంధనలు.. కంటెంట్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాల్సి ఉంటుంది.ఫాలోవర్ల సంఖ్యనే ఆధారంగా తీసుకోరుఇన్ ఫ్లూయెన్సర్లను గుర్తించే క్రమంలో కేవలం ఫాలోవర్ల సంఖ్యనే ఆధారంగా తీసుకోరు. వారి కంటెంట్.. లభిస్తున్న రీచ్.. వస్తున్న వ్యూస్.. క్రెడిబిలిటీ వంటి విషయాలను కూడా పరిగణలోకి తీసుకుంటారు. వేల సంఖ్యలో ఫాలోవర్లు ఉన్నంత మాత్రాన సరిపోదు. వారు రూపొందించే కంటెంట్ నిజంగా ప్రజలకు చేరుతోందా.. ఎంతమంది వీక్షిస్తున్నారు.. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఎంత విస్తృతంగా తీసుకెళ్తున్నారు.. వాటి అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుంది.ఇన్ ఫ్లూయెన్సర్ల ఎం ప్యానెల్మెంట్ కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేయబోతోంది. అర్హత ఉన్న కంటెంట్ క్రియేటర్లు తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. వాటిని పరిశీలించి.. అర్హత ఉన్న వారిని ప్రభుత్వం ఎంపికచేస్తుంది. ఎంపికైన వారికి ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేస్తుంది. ఫలితంగా సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లను కూడా ప్రభుత్వం సమాచార వ్యవస్థల్లో ఒక ప్రత్యేకమైన వర్గంగా గుర్తించే అవకాశం ఉంది.ఇక ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రభుత్వం టీవీ, పత్రికలకు.. అధికారిక సోషల్ మీడియా ఖాతాలకు ప్రకటనలు ఇచ్చేది. అయితే ఇప్పుడు యూట్యూబ్ చానల్స్.. ఫేస్బుక్ పేజీలు.. ఇన్‌స్టాగ్రామ్ పేజీలకు ప్రాధాన్యం లభించబోతోంది. యువత సోషల్ మీడియాలో ఎక్కువగా సమయం గడుపుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పథకాలు.. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే విధంగా ఇన్ ఫ్లూయెన్సర్ల సేవలను ప్రభుత్వం ఉపయోగించబోతోంది.మొత్తంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లకు అద్భుతమైన అవకాశం ప్రభుత్వం నుంచి లభించింది. ఇప్పటివరకు ఫాలోవర్లు.. వీక్షణలు.. ప్రైవేట్ బ్రాండ్ల ద్వారా కంటెంట్ క్రియేటర్లు ఆదాయం పొందుతున్నారు. ఇక ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా కూడా వారికి నగదు లభించే అవకాశం ఉంది.

# బొత్స కంటే చిన్న శ్రీను బలవంతుడా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయనగరం జిల్లా రాజకీయాల్లో బొత్స సత్యనారాయణ సీనియార్టీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బొత్సది నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం. అయితే అందులో సగం పైగా జీవితం చిన్న శ్రీనుది. ఈ ఇద్దరూ కలిసి రెండు దశాబ్దాలకు పైగా జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పారు. బొత్సకు నీడలా ఉంటూ జిల్లాపైన చిన్న శ్రీను ఆధిపత్యం చాటుకున్నారు. బొత్స రాష్ట్ర రాజకీయాల్లో ఉంటూ జిల్లాను చిన్న శ్రీనుకు అప్పగించారు. ఆ విధంగా చిన్న శ్రీను పాతుకుని పోయారు అని చెప్పాలి. ఈ రోజున జిల్లాలో వైసీపీలో అనేక పదవులు అనుభవిస్తున్న వారందరికీ నేరుగా చిన్న శ్రీనుతోనే పరిచయాలు సాన్నిహిత్యం ఉంది. అందుకే అయిదుగురు జెడ్పీటీసీలు రాజీనామా చేసి చిన్న శ్రీను వెంట నడిచారు అని చెబుతున్నారు.

**వ్యూహాలతోనే అంతా :**

చిన్న శ్రీను పేరులో చిన్న ఉండొచ్చు కానీ ఆయన వ్యూహాలలో పెద్ద అని అంటున్నారు. ఆయన రాజకీయ బలం ఏంటో త్వరలోనే చూపిస్తారు అని అంటున్నారు. విజయనగరం జిల్లాలో వైసీపీ మొత్తంగా ఆయనకు పట్టు ఉందని అంటున్నారు. చిన్న శ్రీను ఇపుడు టీడీపీలో చేరడంతో సహజంగానే ఆయన వర్గం కూడా ఆ వైపే ఉంటుందని అంటున్నారు. చిన్న శ్రీను వెంట తాము పాతికేళ్ళుగా నడిచామని అందుక ఆయన తోనే తాము అంటూ వైసీపీకి రాజీనామా చేసిన జెడ్పీటీసీలు చెప్పడాన్ని బట్టి చూస్తే ఇక్కడ పార్టీ కంటే చిన్న శ్రీనుకే ప్రాధాన్యత ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. ఎవరు పోయినా పార్టీ శాశ్వతం అన్న బొత్స మాటలకు భిన్నంగా తమకు చిన్న శ్రీనుయే ముఖ్యమని పలువురు నేతలు చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని కూడా ప్రశ్నలు వస్తున్నాయి.

**చిన్న శ్రీను ప్రభావం :**

ఇదిలా ఉంటే జిల్లా రాజకీయాల్లో చిన్న శ్రీను ప్రభావం గట్టిగానే ఉంటుందని అంటున్నారు. ఆయనకు ఉన్న అనుచర గణంతో పాటు వ్యూహాలు సామాజిక బలం రాజకీయ చతురత ఇవన్నీ కలస్తే ఆయన జిల్లా రాజకీయాలను ప్రభావితం చేయడం ఖాయమని అంటున్నారు. జిల్లాలో అణువణువూ తెలిసిన నేతగా ఆయన ఉన్నారు. టీడీపీలో కూడా ఆయన ధీటుగానే రాణించే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయని చెబుతున్నారు. అక్కడ నియోజకవర్గం నాయకులే అధికంగా ఉన్నారు. అలాంటి చోట జిల్లా మొత్తం తెలిసిన నేతగా చిన్న శ్రీను హవా ఉంటుందని చెబుతున్నారు. మరో వైపు చూస్తే చిన్న శ్రీను వైసీపీని వీడడం వల్ల ఆ పార్టీకి తీరని నష్టం అని అంటున్నారు.

**బొత్సకు ఇబ్బందులేంటి :**

ఇక బొత్స విషయం చూస్తే చిన్న శ్రీను మాదిరిగా కుడిభుజం లాంటి నాయకుడు వెంట లేకపోవడం మైనస్ గా మారుతోంది అని అంటున్నారు. బొత్స రాష్ట్ర స్థాయి నేత. ఆయన జిల్లాలో ప్రతీ చోటా తిరిగి అంతటా తానుగా కనిపించలేరు. మరో వైపు చూతే క్యాడర్ కి ఆయనకు మధ్య ఇపుడు గ్యాప్ ని పూరించే నాయకత్వం కావాలి. ఆయన రాజకీయ వారసులుగా సొంత బిడ్డలు ఉన్నా వారు ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో చిన్న శ్రీనుని టీడీపీని ఏకకాలంలో ఢీ కొట్టడం అంటే వైసీపీకి బొత్స కి కష్ట సాధ్యమే అవుతుంది అని అంటున్నారు. బొత్స సైతం పదునైన రాజకీయ వ్యూహాలు రచించగలరు, కానీ ఆయనకు వయోభారం కూడా ఒక సమస్యగా మారుతుందని అంటున్నారు. ఏది ఏమైనా బొత్స వర్సెస్ చిన్న శ్రీను అంటే చిన్న శ్రీను వైపే నేతలు మళ్ళడాన్ని చూసినపుడు చిన్న శ్రీను బలవంతుడుగా వారికి కనిపిస్తున్నారా అంటే ఇప్పటికి ఇదే కరెక్ట్ అని అంటున్నారు.

# 8 మ్యాచ్‌లు.. 8 నగరాలు: భారత్ vs వెస్టిండీస్ సిరీస్ పూర్తి షెడ్యూల్, స్క్వాడ్స్, స్ట్రీమింగ్ ఇదే!





**హైదరాబాద్ పెన్ పవర్:** సొంతగడ్డపై మరో ఆసక్తికర క్రికెట్ పోరుకు భారత జట్టు సిద్ధమైంది. సెప్టెంబర్ 27వ తేదీ నుంచి అక్టోబర్ 17 వరకు వెస్టిండీస్‌తో టీమిండియా 3 వన్డేలు, 5 టీ20ల వైట్ బాల్ సిరీస్ ఆడనుంది. ఈ ఎనిమిది మ్యాచ్‌ల హోమ్ సిరీస్‌లో కరేబియన్లను క్లీన్ స్వీప్ చేసి, ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటనకు పూర్తి విశ్వాసంతో వెళ్లాలని భారత్ భావిస్తోంది.

**కెప్టెన్లుగా గిల్, శ్రేయస్ శ్రేయస్:**

ఈ సిరీస్ కోసం భారత క్రికెట్ బోర్డు పవర్ ప్యాక్డ్ టీమ్‌లను ప్రకటించింది. వన్డే సిరీస్‌కు శుభ్?మన్ గిల్ నాయకత్వం వహించనుండగా, టీ20 సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. మరోవైపు వెస్టిండీస్ జట్టు రెండు ఫార్మాట్లలోనూ షాయ్ హోప్ సారథ్యంలో బరిలోకి దిగనుంది.

**మ్యాచ్ టైమింగ్స్:**

వన్డే మ్యాచ్‌లు: మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతాయి. మ్యాచ్‌కు అర గంట ముందు (మధ్యాహ్నం 1:00 గంటలకు) టాస్ పడుతుంది.

టీ20 మ్యాచ్‌లు: రాత్రి 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. సాయంత్రం 6:30 గంటలకు టాస్ ఉంటుంది.

**వన్డే సిరీస్:**

1వ వన్డే: సెప్టెంబర్ 27 (తిరువనంతపురం)

2వ వన్డే: సెప్టెంబర్ 30 (గౌహతి)

3వ వన్డే: అక్టోబర్ 3 (న్యూ ఛండీగఢ్)

**టీ20 సిరీస్:**

1వ టీ20: అక్టోబర్ 6 (లక్నో)

2వ టీ20: అక్టోబర్ 9 (రాంచీ)

3వ టీ20: అక్టోబర్ 11 (ఇండోర్)

4వ టీ20: అక్టోబర్ 14 (హైదరాబాద్)

5వ టీ20: అక్టోబర్ 17 (బెంగళూరు)

**లైవ్ స్ట్రీమింగ్ ఎక్కడంటే?:**

టీవీ టెలికాస్ట్: భారత్‌లో ఈ మ్యాచ్‌లు ఘ్ఖుతీ రాజూశీతం చీవ్షశీతీని ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి.

లైవ్ స్ట్రీమింగ్: మొబైల్, ల్యాప్‌టాప్‌లలో జీఱశీనశీర్ఘుతీ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ చూడవచ్చు.

**రెండు జట్ల పూర్తి స్క్వాడ్‌లు:**

భారత వన్డే జట్టు: శుభ్?మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మహమ్మద్ సిరాజ్, ఆకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్.భారత టీ20 జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్.

వెస్టిండీస్ వన్డే జట్టు: షాయ్ హోప్ (కెప్టెన్), జ్యువెల్ ఆండ్రూ, జాన్ కాంప్‌బెల్, కీసీ కార్టీ, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డే, జస్టిన్ గ్రీవ్స్, అమీర్ జంగూ, అల్జారీ జోసెఫ్, షమర్ జోసెఫ్, విటెల్ లాస్, గుడాకేష్ మోటీ, కీమో పాల్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, జేడెన్ సీల్స్.

వెస్టిండీస్ టీ20 జట్టు: షాయ్ హోప్ (కెప్టెన్), జ్యువెల్ ఆండ్రూ, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డే, షిమ్రాన్ హెట్‌మైర్, అకీల్ హోసేన్, షమర్ జోసెఫ్, గుడాకేష్ మోటీ, కీమో పాల్, కమిల్ పూరన్, రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, క్వింటన్ సామ్సన్, రొమారియో షెపర్డ్, షమర్ స్ప్రింగర్.

# రోహిత్‌తో నా బంధం ప్రత్యేకం.. పనిచేసిన కెప్టెన్లందరిదీ ఒకే మాట: గౌతమ్ గంభీర్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మతో తనకున్న బంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమ మధ్య ఉన్నది కేవలం కెప్టెన్–కోచ్ సంబంధం మాత్రమే కాదని, అంతకు మించిన బలమైన అవగాహన ఉందని స్పష్టం చేశాడు. ఆదివారం నుంచి తిరువనంతపురంలో వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్ నేపథ్యంలో గంభీర్ జియోస్టార్‌తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు.“రోహిత్‌తో నా బంధం ఈనాటిది కాదు. అతను జట్టులోకి వచ్చినప్పుడు నేను సీనియర్ ఆటగాడిని. అప్పటి నుంచే మా మధ్య మంచి సంబంధం ఉంది. ఒకరి ఆలోచనా విధానం మరొకరికి బాగా తెలుసు. ఇది మైదానంలో మా పనిని చాలా సులువు చేస్తుంది. కొన్నిసార్లు నా ఆలోచన, కెప్టెన్ ఆలోచన వేర్వేరుగా ఉండొచ్చు. కానీ, అంతిమంగా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని ఇద్దరం నమ్ముతాం. అదే జరిగితే అంతకంటే మంచి విషయం మరొకటి ఉండదు” అని గంభీర్ వివరించాడు.2024 జులైలో తాను హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పనిచేసిన నలుగురు కెప్టెన్లను గంభీర్ ప్రశంసించాడు. “నేను రోహిత్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్‌తో కలిసి పనిచేశాను. ఈ నలుగురిలో నేను గమనించిన ముఖ్యమైన విషయం ‘జట్టుకే తొలి ప్రాధాన్యం’ ఇవ్వడం. తమకంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమని భావించే కెప్టెన్లతో పనిచేయడం నా అదృష్టం” అని అన్నాడు.కెప్టెన్ల గురించి గౌతీ విడివిడిగా మాట్లాడుతూ.. “శ్రేయస్‌లో నాయకత్వ లక్షణాలను నేను 2018లోనే గుర్తించాను. అప్పుడు ఢిల్లీ కెప్టెన్సీని అతనికి అప్పగించాను. ఇప్పుడు మళ్లీ అతనితో పనిచేసే అవకాశం వచ్చింది. ఇక, శుభ్‌మన్ గిల్ చాలా యువకుడు. ఇంగ్లండ్ లాంటి కఠినమైన పర్యటనలో ఐదు టెస్టులకు కెప్టెన్సీ ఇవ్వడమంటే, ఒకరిని లోతైన సముద్రంలోకి తోసేయడం లాంటిది. కానీ, గిల్ ఆ సవాలును అద్భుతంగా స్వీకరించి, ఈత కొట్టి బయటపడ్డాడు. రాబోయే సంవత్సరాల్లో అతనిలో అత్యుత్తమ ఆటను మనం చూస్తాం” అని గంభీర్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ఆలోచనలు, వ్యూహాలు మారొచ్చని, కానీ జట్టు పట్ల కెప్టెన్ల ఉద్దేశం సరిగ్గా ఉన్నంత కాలం సహాయక సిబ్బందికి పని సులువు అవుతుందని పేర్కొన్నాడు.

# తండ్రి పేరుతో వచ్చే ఒత్తిడిని పట్టించుకోను.. నా ఆట నేను ఆడతా





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో డాషింగ్ ఓపెనర్‌గా పేరొందిన వీరేంద్ర సెహ్వాగ్ వారసుడు ఇప్పుడు మైదానంలోకి అడుగుపెట్టాడు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ ఆయన పెద్ద కుమారుడు 18 ఏళ్ల ఆర్యవీర్ సెహ్వాగ్ క్రికెట్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఇటీవలే భారత అండర్–19 జట్టు తరఫున ఆస్ట్రేలియాతో జరిగిన యూత్ వన్డే సిరీస్‌లో ఆర్యవీర్ అరంగేట్రం చేశాడు. ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడి 28, 47, 34 పరుగులు సాధించాడు. అంతకుముందు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లోనూ వెస్ట్ ఢిల్లీ లయన్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు.ఈ సందర్భంగా ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడిన ఆర్యవీర్, తన ప్రదర్శనపై కొంత నిరాశ వ్యక్తం చేశాడు. “మూడు మ్యాచ్‌లలోనూ మంచి ఆరంభాలు లభించినా, వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయాను. చివరి గేమ్‌లో కూడా కుదురుకున్నాక సిక్స్ కొట్టే ప్రయత్నంలో ఔటయ్యాను. ఇది నన్ను నిరాశపరిచింది. క్రికెట్‌లో పేరు సంపాదించాలంటే భారీ పరుగులు చేయడం చాలా ముఖ్యం. ఇన్నింగ్స్‌ను దశలవారీగా విభజించుకుని ముందుకు సాగాలని నేర్చుకున్నాను” అని తెలిపాడు.ప్రఖ్యాత ఇంటిపేరుతో వచ్చే ఒత్తిడి గురించి మాట్లాడుతూ.. ఆర్యవీర్ ఎంతో పరిణతితో సమాధానమిచ్చాడు. “నా ఇంటిపేరు, మా నాన్న సాధించిన విజయాల గురించి నేను ఎంతో గర్వపడతాను. ఆయన పేరు వల్ల నాపై ఎలాంటి ఒత్తిడి, భారం లేదు. ప్రశంసలు, విమర్శలను పట్టించుకోకుండా నా ఆటపై, నా ప్రక్రియపై మాత్రమే దృష్టి పెట్టేలా మైండ్‌సెట్ క్రియేట్ చేసుకుంటున్నాను. అదే నాకు మంచిది” అని స్పష్టం చేశాడు.ఆస్ట్రేలియాతో సిరీస్ అనుభవం తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ఆర్యవీర్ చెప్పాడు. “అరంగేట్రం మ్యాచ్‌కు ముందు కొంచెం నర్వస్‌గా ఉన్నాను. ఆస్ట్రేలియా బౌలర్లు మంచి వేగంతో బౌలింగ్ చేశారు. వారిని ఎదుర్కోవడం ఎంతో ఆనందాన్నిచ్చింది” అని అన్నాడు.తన తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ ఇచ్చే సలహాల గురించి కూడా ఆర్యవీర్ పంచుకున్నాడు. “నాన్న నాకు ఎప్పుడూ బ్యాటింగ్‌ను చాలా సింపుల్‌గా ఉంచుకోమని చెబుతారు. ‘కొట్టగల బంతిని కొట్టు, వదిలేయగలిగేదాన్ని వదిలేయ్, డిఫెండ్ చేయాల్సి వస్తే డిఫెండ్ చెయ్’ అని సలహా ఇస్తారు. సోషల్ మీడియాలో చాలా మాటలు వినిపిస్తుంటాయి కాబట్టి, టెక్నిక్ కంటే మానసిక దృఢత్వంపై ఎక్కువ దృష్టి పెట్టమని చెబుతారు” అని వెల్లడించాడు. తాను విరాట్ కోహ్లీకి పెద్ద అభిమానినని, ఆయన్ను రెండు, మూడు సార్లు కలిశానని ఆర్యవీర్ తెలిపాడు.

# మహేష్ బాబు ను కష్టపెట్టిన దర్శకులు వీళ్లే... అందుకే వాళ్ళతో మరో సినిమా చేయలేదా?







సూపర్ స్టార్ కృష్ణ నటవారసుడిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన నటుడు మహేష్ బాబు... బాల నటుడిగా అలరించిన ఆయన ‘రాజకుమారుడు’ సినిమాతో మెయిన్ హీరోగా మారిపోయాడు. మొదటి సినిమాతోనే ప్రేక్షకులను మెప్పించిన మహేష్ బాబు ఆ తర్వాత సినిమాలతో తనకంటూ ఒక క్రేజ్ ను ఏర్పాటు చేసుకున్నాడు. ముఖ్యంగా మహేష్ బాబు హీరోగా కెరియర్ ను స్టార్ట్ చేసిన మొదట్లోనే కొంతమంది స్టార్ డైరెక్టర్లు అతనితో సినిమాలు చేశారు. అందులో కొందరు అతనికి సక్సెస్ లను అందిస్తే మరి కొంతమంది ఫ్లాప్ లను ఇచ్చారు. ఏది ఏమైనా కూడా మహేష్ బాబు సినిమా కోసం విపరీతంగా కష్టపడడానికి సిద్ధంగా ఉంటాడు. కానీ తను పడే కష్టానికి మించి ఒక ఇద్దరు దర్శకులు మహేష్ బాబును విపరీతంగా ఇబ్బంది పెట్టారట. అందువల్లే ఆ దర్శకులతో మహేష్ బాబు మరో సినిమా చేయలేదని చాలా మంది ఫన్నీ గా చెప్పుకుంటుంటారు. ఇంతకీ ఆ దర్శకులు ఎవరు అంటే ఒకరు తేజ కాగా, మరొకరు కృష్ణవంశీ కావడం విశేషం. తేజ డైరెక్షన్లో మహేష్ బాబు ‘నిజం’ అనే సినిమా చేశాడు. ఈ సినిమాలో మహేష్ బాబు సైకిల్ మీద నుంచి వచ్చి పడిపోయే సన్నివేశాన్ని ఎలాంటి డూప్ లేకుండా మహేష్ బాబు తనే రియల్ గా చేశాడు.నిజానికి మహేష్ బాబు రియల్ గా చేసినప్పటికి ఆ సైకిల్ ఎక్కడ పడాలి అనేది తేజ డిజైన్ చేశారట. అందువల్లే సైకిల్ మీద వస్తున్న మహేష్ కి తెలియకుండానే మధ్యలో ఒక బండరాయిని పెట్టి సైకిల్ తొక్కుకుంటూ రమ్మని చెప్పాడు. ఆ సైకిల్ తొక్కే మహేష్ బాబుకి బండిరాయి ఎక్కడుందో తెలియదు కాబట్టి అనుకోకుండా రోడ్డు మధ్యలో నుంచి వస్తుంటే సైకిల్ బండ రాయి ఎక్కి కింద పడిపోతుంది. ఇక ఈ సన్నివేశాన్ని దర్శకుడు చాలా రియలెస్టిక్ గా చిత్రీకరించడానికి బండ ఎక్కడ పెట్టారో సైకిల్ ఎక్కడ పడిపోవాలో కూడా మహేష్ బాబు కి చెప్పలేదట.అది ఆటోమేటిగ్గా జరిగితేనే బావుంటుందని రియాలెస్టిక్ గా రావడానికి అలా చేశారట. మొత్తానికైతే ఈ సినిమాలో మహేష్ బాబు అద్భుతమైనటువంటి నటనను కనపరిచాడు. సినిమా అనుకున్న రేంజ్ లో ఆడకపోయిన కూడా మహేష్ బాబుకు నటన పరంగా మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పటివరకు తన ఎంటైర్ కెరీర్ ని కనక చూసుకుంటే తను అద్భుతంగా నటించిన త 3 సినిమాల్లో నిజం సినిమా కూడా ఒకటి అనే చెప్పాలి. ఏది ఏమైనా కూడా మహేష్ బాబు ఇమేజ్ అనేది తారాస్థాయికి వెళ్లకపోయిన కూడా ఈ సినిమాతో నటుడిగా తనకంటూ ఒక పరిణితి సంపాదించుకున్నాడు.కృష్ణవంశీ దర్శకత్వంలో చేసిన ‘మురారి’ సినిమా గురించి మనం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. ఈ సినిమాతో మహేష్ బాబు కి ఒక మంచి విజయం దక్కడమే కాకుండా తన నట పోటెన్షియాలిటీ కూడా పూర్తిస్థాయిలో బయటికి వచ్చింది. అయితే ఈ సినిమా సమయంలో కొన్ని సన్నివేశాలను దర్శకుడు రియలెస్టిక్ గా రావడానికి మహేష్ బాబు ను చాలా ఇబ్బంది పెట్టి మరి యాక్టింగ్ చేయించుకున్నారట. దాంతో మహేష్ బాబు సినిమా కోసం విపరీతంగా కష్టపడ్డాడు. అయినప్పటికి కృష్ణవంశీ తో మాత్రం మరొక సినిమా చేయలేదు. కారణం ఏంటి అంటే అతను నటులను చాలా ఇబ్బంది పెడతాడు. ఏం చేసైనా తనకు కావలసింది రాబట్టుకుంటాడు. కాబట్టి అందుకే అతనితో సినిమా చేయలేదు అంటూ మహేష్ బాబు మీద కొంతమంది కామెంట్స్ చేస్తుంటారు. నిజానికి మహేష్ కి సెట్ అయ్యే కథలను వాళ్ళు మరోసారి తన దగ్గరికి తీసుకురాలేదని అందుకే ఆయన మరోసారి వాళ్ళతో జత కట్టలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా కూడా మహేష్ బాబు తన మీద ఎలాంటి వార్తలు వచ్చినా వాటిని లైట్ తీసుకుంటాడు. కాబట్టే వేటి గురించి ఆయన పెద్దగా పట్టించుకోడు...

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965